Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 17.02.2017, శుక్రవారం   సంపుటి : 36 సంచిక : 37   పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి   సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com



## రోజా ఎపిసోడ్‌లో...
# తప్పులో కాలేసిన బాబు

***చం**ద్రబాబు కలల రాజధాని అమరావతి వేదికగా మూడురోజులు మహిళా పార్లమెంటేరియన్ సదస్సు నిర్వహించారు. లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ మొదలుకొని మహిళా మంత్రులు, మహిళా ప్రజాప్రతినిధులు, వివిధ రంగాలలో రాణిస్తున్న మహిళలతో పాటు సీఎంల కూతుర్లు, కోడళ్లు, కేంద్రమంత్రుల కూతుర్లు కూడా ఈ సదస్సులో పాల్గొని మహిళా సాధికారత గురించి మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుకు దూసుకుపోవాలని పిలుపునిచ్చారు.*

అయితే వారి పిలుపులన్నీ కూడా అక్కడ కూర్చున్న వారి చెవులకు మాత్రమే చేరాయి. దేశ వ్యాప్తంగా వున్న మహిళల మనసులను తాకలేదు. వ్రతం చెడ్డా ఫలితం దక్కనట్లయ్యింది ఈ మహిళా పార్లమెంటేరియన్ సదస్సు తీరు! దీనికి కారణం తెలుగుదేశం ప్రభుత్వం వేసిన తప్పటడుగే!

కోట్లు ఖర్చుపెట్టి మూడురోజులు నిర్వహించిన మహిళా సదస్సులోని మహిళల సందేశాలకంటే కూడా పోలీసుల చేతిలో అరెస్ట్ కాబడిన వైకాపా ఎమ్మెల్యే రోజా మాటలనే రాష్ట్ర ప్రజలు ఎక్కువుగా విన్నారు. ఆమెను అరెస్ట్ చేసి తీసుకెళ్తున్న దృశ్యాలనే ఈ రాష్ట్ర ప్రజలు ఎక్కువుగా చూసారు. రోజా అక్రమ నిర్బంధంతో మూడురోజుల పాటు ఆర్భాటంగా చేసిన మహిళా సదస్సుకు అర్థం పర్థం లేకుండాపోయింది.. రోజాను నిర్బంధించిన తీరే హైలెట్ అయ్యింది. రోజా ఉగ్రవాది కాదు, నేరస్థురాలు కాదు. అదీగాక మహిళా సదస్సు కమిటీలో సభ్యురాలు కూడా! ఇక శాసనసభ్యురాలు. మహిళా సదస్సులో ఆమె ఏం మాట్లాడుతుంది, ఏం మాట్లాడాలనుకుంటున్నది కూడా ఎవరికీ తెలియదు! కాకపోతే గత మూడేళ్లలో ఈ రాష్ట్రంలో (మిగతా 11వ పేజీలో)

గరంగరం సవత్ర



# ముగిసిన తమిళ 'నాటకం'

- సీఎం పీఠమెక్కాలన్న శశికళకు జైలు జీవితం
- తిరుగుబాటు వీరుడు పన్నీరుకు మిగిలింది కన్నీరే
- విధేయత చాటుకున్న పళనిస్వామికి సీఎం పీఠం

**గ**త కొన్ని రోజులుగా తమిళనాడులో ఉత్కంఠభరితంగా జరుగుతున్న రాజకీయ పరిణామాలకు గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు ఫుల్‌స్టాప్ పెట్టారు. రెండురోజుల గడువులో రెండు ఊహించని పరిణామాలతో తమిళనాడు రాజకీయాలు అనూహ్య మలుపులు తిరిగాయి. సీఎం కుర్చీ కోసం ఆరాటపడి, తమిళనాడులో రాజకీయ సంక్షోభానికి కారణమైన శశికళ చివరికి అక్రమాస్తుల కేసులో జైలుకుపోగా, ఆ పక్కరోజే 16వ తేదీ ఎన్నో రోజులుగా కొనసాగుతున్న రాజకీయ అనిశ్చితికు తెరదించుతూ గవర్నర్ విద్యాసాగర్‌రావు (మిగతా 11వ పేజీలో)







## ఆకాశమంత...
# విజయం

3లో

- ఒన్ షాట్... 104 హిట్స్
- ఇస్రో ప్రపంచ రికార్డ్
- ఇది అనితర సాధ్యమైన వాణిజ్య విజయం
- ఉపగ్రహ ప్రయోగాలలో ఇక భారత్‌వైపే ప్రపంచం చూపు
- పిఎస్ఎల్‌వి - సి37 సక్సెస్‌తో ఇనుమడించిన భారత్ ప్రతిష్ట

## నేతల పాపం...
# నిధులకు శాపం

ఓ పక్క అభివృద్ధి పనులకు నిధులు కావాలని అడుక్కుంటుంటారు. ఇంకోపక్క వచ్చిన నిధులను ఖర్చుపెట్టే దిక్కు లేక అవి తిరిగి పోతుంటాయి. ప్రజాప్రతినిధుల మధ్య విభేదాలు, అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల తాత్సారం మూలంగా మంజూరు చేసిన పనులు కూడా రద్దయ్యి, నిధులు వెనక్కిపోతున్నాయి. జిల్లాలో నిధులు మంజూరు చేసినా కూడా ఇంకా మొదలుకాని పనులను రద్దు చేస్తూ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కన్నబాబు ఆదేశాలు జారీ చేశారు. నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు ఆయా మున్సిపాల్టీల్లో అభివృద్ధి పనులకు 51.40కోట్లు మంజూరు చేశారు. అయితే ఇంతవరకు 12.14 కోట్లు మాత్రమే ఖర్చయ్యాయి. 42.67కోట్ల పనులను మొదలుపెట్టలేదు. ఈ నిధులను ఖర్చు చేయాల్సిన గడువు ముగియడంతో ఆ పనులను రద్దు చేశారు. 2016 మార్చి 9న జిల్లాలో మున్సిపాల్టీలకు 51.40కోట్ల అభివృద్ధి పనులు మంజూరు చేస్తూ రాష్ట్ర మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పనులకు ఈ నిధులు కేటాయించారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో 36.16 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో 200 పనులు ప్రతిపాదించగా ఇప్పటివరకు 8.94 కోట్ల ఖర్చుతో 89పనులు పూర్తి చేశారు. మిగతావి మొదలుకాకపోవడంతో 27.32కోట్లతో చేపట్టాల్సిన 111 పనులు రద్దయ్యాయి. కావలి మున్సిపాల్టీ ఈ విషయంలో కొంచెం బెటర్. వారికి 4కోట్లు మంజూరయ్యాయి. 3.20కోట్ల ఖర్చుతో 19పనులు పూర్తి చేశారు. పెండింగ్‌లో వున్న 80లక్షలతో చేపట్టాల్సిన నాలుగు పనులు రద్దయ్యాయి. కాని వెంకటగిరి, సూళ్లూరుపేట, ఆత్మకూరు, నాయుడుపేట మున్సిపాల్టీల్లో ప్రతిపాదించిన ఏ పనీ చేపట్టకపోవడంతో మంజూరు చేసిన పనులన్నీ కూడా రద్దయ్యాయి.

సింహపురి సమాచారం

## 'అందరికీ ఇళ్ల'పై నిర్లక్ష్యం!

**- బీజేపీ సీనియర్ నాయకులు కరణం భాస్కర్**

అధికారుల ఉదాసీనత మూలంగా పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలన్న కేంద్రప్రభుత్వం లక్ష్యం నెరవేరడం లేదని మాజీకౌన్సిలర్, బీజేపీ సీనియర్ నాయకులు కరణం భాస్కర్ ఒక ప్రకటనలో ఆరోపించారు. అర్బన్ హౌసింగ్ స్కీం క్రింద నెల్లూరు నగరానికి 5260 ఇళ్లు మంజూరు చేసారు. 5నెలల క్రితం ఎవరికీ అభ్యంతరం లేని స్థలంలో ఇళ్ళ నిర్మాణానికి అభ్యంతరం లేని స్థలంగాని, పొజిషన్ సర్టిఫికెట్ గాని, పట్టాగాని మంజూరు చేయమని తహశీల్దార్‌ను కోరుతూ నగర కమిషనర్‌కు లేఖ వ్రాసారు. ఇప్పటివరకు నెల్లూరు తహశీల్దార్ దీనిని గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. కేంద్రప్రభుత్వం ఈ పథకం క్రింద ఇంటిని మూడురకాలుగా డిజైన్ చేసింది. ఈ డిజైన్ ప్రకారం 3లక్షల 50వేలు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఇందులో కేంద్రం లక్షా 50వేలు, రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయలు ఉచితంగా ఇస్తాయి. 75వేలు బ్యాంకు ఋణం కాగా 25వేలు లబ్ది దారుడు భరించాలి. పొజిషన్ సర్టిఫికెట్ లేదా పట్టా వస్తేగాని ఈ ఇళ్ళ పనులు మొదలుకావు. కేంద్ర ఉత్తర్వుల ప్రకారం మార్చి, 2017కి ఈ స్కీం క్రింద చేపట్టిన ఇళ్ళ నిర్మాణం పూర్తి కావాలి. కాని తహశీల్దార్ అలసత్వం మూలంగా ఇంకా నిర్మాణాలే మొదలు కాలేదని, ఇకనైనా తహశీల్దార్ దీనిపై దృష్టి సారించాలని ఆయన కోరారు.

## ఎమ్మెల్యే చొరవతో పోస్ట్‌మార్టం!

ప్రమాదాల్లో ఆప్తులు చనిపోయి పుట్టెడు దుఃఖంలో వున్న బంధువుల పాలిట పోస్ట్‌మార్టమ్ మరింత ఇబ్బందిగా మారుతోంది. పోస్ట్‌మార్టం పూర్తయితే కానీ మృతదేహాన్ని తీసుకెళ్లి తదుపరి కార్యక్రమాలు నిర్వహించలేరు. కాని పోస్ట్‌మార్టం ప్రక్రియ వైద్యాధికారుల చేతుల్లో ఉండడంతో వాళ్లు కదిలితేగాని మృతదేహాలను తీసుకెళ్లే పరిస్థితి లేకుండా పోతోంది. చివరకు పోస్ట్‌మార్టమ్ వ్యవహారాలలో ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోవాల్సివస్తోంది. మొన్న ఇందుకూరుపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అశోక్ అనే యువకుడు మృతి చెందాడు. పోస్ట్‌మార్టం కోసం నెల్లూరు పెద్దాసుపత్రికి తీసుకురాగా, యాక్సిడెంట్ ఇందుకూరుపేట పరిధిలోది కాబట్టి అక్కడికి తీసుకెళ్లమని వైద్యులు చెప్పారు. దీంతో మృతుడి బంధువులు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకురాగా ఆయన స్పందించి ఆసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మన్ చాట్ల నరసింహారావు, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వరసుందరం, ఫోరెన్సిక్ వైద్యులు డాక్టర్ శశికాంత్‌లతో మాట్లాడి పోస్ట్‌మార్టం అక్కడే నిర్వహించే ఏర్పాట్లు చేసారు.

## ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు



ఒకేసారి 104 ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టడం ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు భారతదేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింపజేశారని నెల్లూరులోని వి.ఆర్ కళాశాల ఫిజిక్స్ విభాగాధిపతి డా॥. ఎం.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. 16వ తేదీ కళాశాలలో జరిగిన ఇస్రో శాస్త్రవేత్తల అభినందన సభలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రయోగంతో అంతరిక్ష పరిశోధనా రంగంలో భారతదేశం అగ్రగామిగా ఎదిగిందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ప్రయోగాలకు ఈ ప్రయోగం స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సి.వి.ఎస్.భాస్కర్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

## మైలేజిని సాధించేందుకు
# అందరూ కృషి చేయాలి

ఆర్టీసీలో మైలేజిని సాధించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, కిలోమీటర్ ఫర్ లీటర్‌ను ఎక్కువ సాధిస్తేనే సంస్థకు మనుగడ ఉంటుందని సంస్థ ఇ.డి మహేశ్వర్ తెలిపారు. సోమవారం నెల్లూరు ఆర్టీసీ డిపో-1 గ్యారేజీలో నిర్వహించిన ఇంధన పొదుపు పక్షోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అత్యాధునిక టెక్నాలజీని అందిపుచ్చుకుని మైలేజిని సాధించడం ద్వారా ఆర్టీసీకి అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. కిలోమీటర్ ఫర్ లీటర్‌ను ఎక్కువ సాధించడం వల్ల రాష్ట్రంలో ఆర్టీసీకి ఏటా రూ.25కోట్లు మిగులుతుందని తెలిపారు. అనంతరం జిల్లాలోని అన్ని డిపోల్లో అత్యధిక మైలేజిని సాధించిన మొదటి ముగ్గురు డ్రైవర్లకు బహుమతులందజేశారు. ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీ స్టాండింగ్ సమావేశం

జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు ఈ నెల 28న జడ్పీ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించనున్నట్లు సి.ఇ.ఓ బి.రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గృహనిర్మాణం, గ్రామీణ నీటి సరఫరా, జిల్లా గ్రామీణాభివృద్ధి, డ్వామా, వ్యవసాయం, విద్య వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లు, పంచాయితీరాజ్, జలవనరుల శాఖల పనితీరుపై స్టాండింగ్ కమిటీ సమావేశాలలో చర్చ ఉంటుందని తెలిపారు.

## బ్యాలెట్ బాక్సులు
# పరిశీలించిన కలెక్టర్

నెల్లూరులోని పాత జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉన్న బ్యాలెట్ బాక్సులను 12వ తేదీ జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు ఆదివారం పరిశీలించారు. జడ్పీ సిఇఓ బి.రామిరెడ్డితో కలిసి ఆయన బ్యాలెట్ బాక్సులను వీక్షించారు. త్వరలో శాసన మండలి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికలకు బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేయడంలో భాగంగా పరిశీలన జరిపినట్లు తెలిసింది.

## భూగర్భ జలాలు పెంచుకుంటే...
# సాగునీటి సమస్యలుండవు

**- కర్ణాటక మంత్రి జయచంద్ర**

వాగులు, వంకలు వద్ద నీటి నిల్వలు పెంచుకుంటే భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయానికి సాగునీటి సమస్యలు తొలగుతాయని కర్ణాటక రాష్ట్ర చిన్నతరహా నీటిపారుదల శాఖామంత్రి టి.బి.జయచంద్ర అన్నారు. ఆదివారం ఆయన నెల్లూరుజిల్లా ఉదయగిరి ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావుతో కలిసి జలదంకి వద్ద చిప్పలేరుపై నిర్మించిన చెక్‌డ్యాంను, పక్కనే ఏర్పాటుచేసిన సేద్యపుగుంతను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి జయచంద్ర మాట్లాడుతూ తన నియోజకవర్గంలో కూడా ఇలాంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన చెక్‌డ్యాంలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ఉదయగిరి ఎమ్మెల్యే వెంకట రామారావు మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో 250చెక్‌డ్యాంలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 125చెక్‌డ్యాంలు పూర్తి చేసామన్నారు. మామూలుగా నిర్మించే చెక్‌డ్యాంలకు రూ.200కోట్లు అవసరమవుతాయని, కాని ఫైబర్ గేట్లతో 250 చెక్‌డ్యాంలను కేవలం రూ.75కోట్లతో నిర్మించవచ్చన్నారు. టిడిపి నాయకులు మెట్టుకూరి చిరంజీవిరెడ్డి, కె.మధుబాబునాయుడు, పులుగుంట మధురెడ్డి, వంటేరు జయచంద్రారెడ్డి, సిహెచ్ మస్తాన్‌రెడ్డి, కంచర్ల వినోద్, దశరథ రామానాయుడు, మద్దూరు శ్రీనివాసులురెడ్డి, నక్కా మాధవరావు పాల్గొన్నారు.

## సకల సుగుణాభిరాముడు.. మన శ్రీరాముడు

**- కోట రాజశేఖర్ అవధాని**



వాల్మీకి రామాయణం ఎంతో బృహత్తరం.. మహత్తరమైనదని, శ్రీరాముడు ధర్మస్వరూపుడని.. సకల సుగుణాభిరాముడని, రామాయణం పారాయణం చేయడం ద్వారా జనులందరికీ సర్వ శుభాలు కలుగుతాయని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు, అల్లూరు రామకృష్ణా జూనియర్ కళాశాల విశ్రాంత సంస్కృతోపన్యాసకులు కోట రాజశేఖర్ అవధాని అన్నారు. కోవూరు మండలం లేగుంటపాడు గ్రామంలోని శ్రీ కోదండరామస్వామి ఆలయ ప్రాంగణంలో గతనెల 28 నుంచి ఈ నెల 6వ తేది వరకు శ్రీమద్ రామాయణ జ్ఞానయజ్ఞం అఖండంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన పదిరోజుల పాటు శ్రీమద్ రామాయణం వైశిష్ట్యాన్ని, రామాయణంలోని ముఖ్యమైన ఘట్టాలను వివరిస్తూ ప్రధానమైన శ్లోకాలను మధురంగా భక్తులకు వినిపించారు. గాయత్రీ మంత్రాక్షరాలతో నిక్షిప్తమై, పరమ పవిత్రమై.. ఇరవై నాలుగువేల శ్లోకాలతో.. ఏడు కాండలతో అత్యద్భుతమైన రీతిలో వాల్మీకి రామాయణం ఆవిర్భవించిందన్నారు. శ్రీరాముడు లోకానికే ఆదర్శమని, అందరికీ ఆరాధ్యదైవమని అన్నారు. తల్లిదండ్రులను సేవించి శ్రీరాముడు ఆదర్శపుత్రుడుగా ప్రఖ్యాతి చెందాడని, పితృవాక్పరిపాలకునిగా.. ఆదర్శవంతమైన ప్రజాపాలకునిగా అందరి ప్రశంసలందుకున్నాడని, రామరాజ్యంలో ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లారని, అందువల్ల అందరూ రామరాజ్యం కావాలని కోరుకుంటారని ఆయన పేర్కొన్నారు. మొత్తంగా 10రోజుల పాటు ఆయన 'రామకథ'ను భక్తులకు వీనుల విందుగా వినిపించారు. ఈ రామాయణ జ్ఞానయజ్ఞంలో భాగంగా 7వ రోజున 'రథసప్తమి'ని పురస్కరించుకుని నరసింహకొండ సమీపంలోని వేదగిరి ఆశ్రమ పీఠాధిపతులు శ్రీ మహేశానందస్వామివారు విచ్చేసి, శ్రీరామచంద్రుని వైశిష్ట్యాన్ని, ప్రత్యేకించి శ్రీరాముని దానగుణాన్ని వివరించగా, 10వ రోజున ఇనమడుగులోని శ్రీ సత్యానందాశ్రమ నిర్వాహకులు శ్రీహరిస్వామి పాల్గొని రామాయణం గొప్పదనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో లేగుంటపాడు గ్రామ ప్రముఖులు జెట్టి రామచంద్రారెడ్డి భారతీయ సంస్కృతి సంప్రదాయాల విశిష్టతను ప్రతిరోజూ తన తొలిపలుకుల్లో వివరించారు. ఈ జ్ఞానయజ్ఞం పూర్తయిన సందర్భంగా జెట్టి రామచంద్రారెడ్డి-నిర్మలమ్మ దంపతుల పక్షాన పామూరు నాగభూషణరెడ్డి-నీరజమ్మ దంపతులు కోట రాజశేఖర్ అవధానిని పట్టువస్త్రాలతో, పూలమాలికలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఏకాగ్రతతో పాల్గొని ఆద్యంతం రామకథను ఎంతో ఆసక్తితో విని పరవశించారు. స్థానిక ప్రముఖులు, అధికారులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## బీజేపీ బలమైన శక్తిగా మారాలి

**- జిల్లా బీజేపీ అధ్యక్షుడు**

2019 ఎన్నికల నాటికి భారతీయ జనతా పార్టీని బలమైన శక్తిగా తయారు చేసేందుకు ప్రతి కార్యకర్త నడుం బిగించాలని నెల్లూరుజిల్లా బీజేపీ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి కోరారు. నెల్లూరుజిల్లా కోవూరు మండలం లేగుంటపాడు గ్రామంలో 11వ తేదీ పార్టీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతో రాష్ట్రాభివృద్ధి జరుగుతుంటే టిడిపి ప్రభుత్వం మాత్రం తమ సొంత నిధులు ఖర్చు చేసినట్లు ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రం రాష్ట్రంపై ప్రత్యేకశ్రద్ధ తీసుకుని అభివృద్ధికి ప్రత్యేకప్యాకేజీ పేరుతో కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. టిడిపి మాత్రం బీజేపీ పట్ల చిన్నచూపు చూస్తోందన్నారు.

# ఆకాశమంత విజయం



**మన కళ్ళ ముందే పుట్టిన బిడ్డ... తప్పటడుగులు వేస్తూ పెరిగి... ఆటుపోట్లను ఎదుర్కొంటూ చదివి... ఎన్నో స్థాయిలను దాటుకుని ఎత్తుపల్లాలు అధిగమిస్తూ ఐఏఎస్ ర్యాంక్‌ను కొడితే ఎంత ఆనందిస్తామో... ఈరోజు మన దేశ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో సాధిస్తున్న విజయాలను చూస్తే కూడా అంతే ఆనందమేస్తుంది. మన 'ఇస్రో' అంతర్జాతీయంగా ఎదిగినందుకు మనసు ఉప్పొంగుతుంది. ప్రపంచంలో అగ్రరాజ్యాలు సాధించలేని ఘనతను మన ఇస్రో సాధించినందుకు ఛాతి గర్వంతో ఉప్పొంగుతుంది.**

స్వాతంత్ర్యానంతరం ఈ ఏడు దశాబ్దాలలో భారతదేశం ఎన్నో రంగాలలో విజయాలు సాధించింది. అయితే ఇతర రంగాలలో అనుకున్న ప్రగతిని అందుకోవడం కష్టంగానే వుంది. దీనికి కారణం మిగిలిన రంగాలన్నింటికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రాజకీయ వ్యవస్థలతో సంబంధముండడమే! మన రాజకీయ వ్యవస్థలు ఎంతగా దిగజారిపోయి వున్నాయో చూస్తూనే వున్నాం. ఇలాంటి రాజకీయ వ్యవస్థలున్న చోట ఆశించిన అభివృద్ధిని సాధించడం కూడా కష్టమే!

అయితే రాజకీయ వ్యవస్థలతో ఏ మాత్రం సంబంధాలు పెట్టుకోకుండా ప్రతిభనే వేదికగా మలచి, దేశ ప్రతిష్టనే లక్ష్యంగా పెట్టుకుని అగ్రరాజ్యాలకు ధీటుగా దూసుకుపోతున్న ఏకైక వ్యవస్థ భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో). అమెరికా, జపాన్, రష్యా, చైనా వంటి అగ్రదేశాలకు అంతరిక్ష ప్రయోగాలలో ధీటుగా సమాధానమిస్తున్న మన ఇస్రో మరో అంతరిక్ష అద్భుతాన్ని మనకు కానుకగా అందజేసింది. ఒకే రాకెట్ ద్వారా 104ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశ పెట్టింది. అంతరిక్ష ప్రయోగాలలో వరల్డ్ రికార్డును సృష్టించింది. ఇంతవరకు ఏ అగ్రదేశం కూడా ఒకే రాకెట్ ద్వారా ఇన్ని ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపలేదు. రష్యా మాత్రం 2014లో ఒకే రాకెట్ ద్వారా 37 ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టింది. 104 ఉపగ్రహాల ప్రయోగంతో ఇస్రో ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచింది.

ఇంతటి అద్భుత ప్రయోగానికి నెల్లూరుజిల్లా శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం వేదికగా నిలిచింది. 15వ తేదీ ఉదయం 9.28 గంటలకు తన కడుపులో దాచుకున్న 104 ఉపగ్రహాలతో పిఎస్‌ఎల్‌వి-సి37 నింగికి దూసుకుపోయింది. 28నిముషాల పాటు 524 కిలోమీటర్లు ప్రయాణించాక ఉపగ్రహాలన్నింటిని కూడా వాటివాటి కక్ష్యల్లో జాగ్రత్తగా చేర్చింది. ఈ 104 ఉపగ్రహాలలో మన దేశానికి చెందిన కార్టోశాట్-2, ఐఎన్ఎస్-1ఏ, ఐఎన్ఎస్-1బి ఉపగ్రహాలున్నాయి. మిగిలిన 101 ఉపగ్రహాలలో 96 అమెరికావి కాగా, ఇజ్రాయిల్, కజకిస్థాన్, నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్, యూఏఇ దేశాలకు చెందిన ఉపగ్రహాలు ఒక్కోటి లెక్కన ఉన్నాయి.

ఈ చరిత్రాత్మక ప్రయోగంతో ఇస్రో ప్రపంచ దేశాలకే సవాల్‌గా నిలిచింది. అతి తక్కువ ఖర్చుతో అంతరిక్ష ప్రయోగాలను విజయవంతం చేస్తున్న ఖ్యాతి ఇస్రో సొంతమవుతోంది. ఒకేసారి 104 ఉపగ్రహాల ప్రయోగంతో మనం అగ్ర దేశాలకు పోటీగా మారడం కాదు, ఆ దేశాలే మనతో పోటీ పడే పరిస్థితి కల్పించాము. ముఖ్యంగా నిన్న జరిపింది వాణిజ్య ప్రయోగం. సాధించింది వాణిజ్య విజయం. అతితక్కువ ఖర్చుతో అత్యంత నమ్మకంతో మీ ఉపగ్రహాలను మేం కక్ష్యలోకి చేరుస్తామన్న భరోసాను ఇస్రో ప్రపంచ దేశాలకు ఇవ్వగలిగింది. ఇక ఏ దేశమైనా తమ ఉపగ్రహాల ప్రయోగాలకు మొదటి ప్రాధాన్యతనిచ్చేది ఇస్రోకే! ఎందుకంటే ఇస్రో ప్రయోగాలు తక్కువ ఖర్చుకే కాదు, విజయాలకు కూడా కేరాఫ్ అడ్రస్‌గా మారింది కాబట్టి!




15వ తేదీ నెల్లూరులో ఇస్రో విజయోత్సవ ర్యాలీని నిర్వహిస్తున్న తెలుగుదేశం నాయకులు

## అవధూత శ్రీ నారాయణస్వామి

## ఆరాధన 19న



వింజమూరు మండలంలోని మోట చింతలపాళెం గ్రామంలో వెలసిన అవధూత శ్రీ నారాయణస్వామివారి సప్తమ ఆరాధన మహోత్సవం ఈ నెల 19న జరుగుతుంది. ఆ మేరకు భక్తులు ఈ ఉత్సవాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. భగవంతుని నమ్మినవారు ఎన్నటికీ చెడిపోరని, శరీరానికి భోజనం ఎంత అవసరమో ఆత్మకు దైవప్రార్ధన కూడా అంతే అవసరమని, తల్లిదండ్రులను ఆదరించినవారు అన్ని ధర్మాలు నిర్వర్తించినట్లేనని.. తల్లిదండ్రులను ఆదరించనివారు ఎన్ని ధర్మాలు ఆచరించినా వ్యర్థమేనని.. ఇలా అనేక సూక్తులు.. ధర్మబోధనలు చేసి సమాజానికి వెలుగు బాట చూపినవారు అవధూత నారాయణ స్వామివారు. ఆయనకెంతోమంది భక్తులున్నారు. ఈ గ్రామంలో వున్న శ్రీ నారాయణస్వామివారి మఠంలో స్వామివారికి నిత్యపూజలు జరుగుతుంటాయి. ప్రత్యేకించి, ఆరాధన రోజున ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల దాకా స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహిస్తారు. ప్రత్యేక పూజలు, హోమాల అనంతరం మధ్యాహ్నం భక్తులందరికీ అన్నప్రసాద వితరణ వుంటుంది. అదే రోజు రాత్రికి ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భజనలు నిర్వహిస్తారు. స్వామివారి భక్తులు శ్రీ రాజా సత్యనారాయణ, శ్రీనారాయణ స్వామివారి భక్తబృందం ఆధ్వర్యంలో ఈ ఆరాధన జరుగనుంది. భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని భక్తబృందం కోరుతోంది.

# మా మూడూ మీ చేతిలో పెడతాం!

## - ఎమ్మెల్సీ ఎన్నికలపై చంద్రబాబుకు వివేకా హామీ



నెల్లూరుజిల్లాకు సంబంధించి జరుగుతున్న మూడు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలలోనూ తెలుగుదేశం అభ్యర్థులను గెలిపించి, ఆ మూడు సీట్లను మీ చేతుల్లో పెడతామని ముఖ్యమంత్రి చంద్రబాబుకు మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి హామీనిచ్చారు. 15వ తేదీ విజయవాడ క్యాంప్ ఆఫీసులో ఆయన సీఎం చంద్రబాబును కలిసారు. ప్రజానాయకుడు మంత్రి నారాయణ నాయకత్వంలో తిండి, నీళ్ళు, నిద్ర మానేసి కష్టపడి ఈ మూడు స్థానాల్లో పార్టీని గెలిపిస్తామని భరోసా ఇచ్చారు. సీఎంను కలిసి బయటకొచ్చాక ఆయన విలేకరులతో మాట్లాడుతూ నెల్లూరోడికి వాక్‌శుద్ధి జాస్తని, ఏది చెబితే అది జరుగుద్దని అన్నారు. వివేకా తనను తాను దూకుడు సినిమాలో యం.యస్.నారాయణతో పోల్చుకున్నట్లున్నాడు. పనిలో పనిగా రోజా తనపై వేసిన కేసు విషయాన్ని కూడా ప్రస్తావించి, దానిని కోర్టులోనే తేల్చుకుంటానన్నాడు. రోజాపై మళ్ళీ వెటకారపు వ్యాఖ్యలే చేసాడు.

# ఎంఎస్ఆర్ సేవాసమితి అన్నదానం



మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవాసమితి వ్యవస్థాపకులు మాగుంట శరత్‌చంద్రారెడ్డి పెళ్ళిరోజును పురస్కరించుకుని బుధవారం నెల్లూరు బాలాజీనగర్‌లోని ఎమ్ఎస్ఎమ్ పాఠశాలలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సేవాసమితి సభ్యులు కమతం అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సేవాసమితి ద్వారా గత రెండు సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దారా మహేష్, పి.సాయికృష్ణ, చైతన్యరెడ్డి, రాజేష్, చరణ్, బోస్ తదితరులు పాల్గొన్నారు.




మేరా భారత్ మహాన్...

జయహో ఇస్రో... జైజై షార్

అంతరిక్ష ప్రయోగాలలో అగ్రరాజ్యాలను తలదన్నుతూ,
పిఎస్ఎల్వి-సి37 రాకెట్ ద్వారా 104 ఉపగ్రహాలను
కక్ష్యలో ప్రవేశపెట్టి భారతీయుల సత్తాను ప్రపంచానికి చాటిన
"ఇస్రో" శాస్త్రవేత్తల బృందానికి
హృదయపూర్వక శుభాభినందనలు.

- అనుమారెడ్డి రామ్‌ప్రతాప్‌రెడ్డి

సాయి ప్రతాప్ ఎయిర్ కండీషనర్స్

15/173-ఎ, బృందావనం, నెల్లూరు - 1. ఫోన్. 0861 - 2347273.

## 'ప్రభా'తం

### ఫిబ్రవరి–15

*అంతరిక్ష పరిశోధనల్లో భారత్ తన సత్తా చాటిన రోజు.*

*ఒకే రాకెట్ ద్వారా.. 104 ఉపగ్రహాలను దిగ్విజయంగా పంపిన రోజు.*

*గగనతలంలో ఇస్రో.. విశ్వవిజేతగా నిలచిన రోజు..*

*ఇది చరిత్రాత్మకమైన రోజు..భారత్‌కు ఎంతో గర్వకారణమైన రోజు..*


ఒకే రాకెట్..104 ఉపగ్రహాలు..నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకువెళ్ళిన పిఎస్ఎల్వి-37 దిగ్విజయంగా కక్ష్యలోకి చేరి అద్భుత విజయాన్ని నమోదు చేసింది. భారత్‌కు అఖండకీర్తిని అందిస్తూ..గగనవీధుల్లో భారత్ జయపతాకను ఇస్రో మరోసారి రెపరెపలాడించింది. అంతరిక్ష రంగంలో భారత్ అద్భుతమైన రికార్డ్ సృష్టిస్తూ, ఒకేసారి104 ఉపగ్రహాల ప్రయోగాన్ని విజయవంతం చేసి ఇస్రో.. అగ్రదేశాలనే అబ్బురపరచింది.. ప్రపంచాన్నే విస్మయానికి గురిచేసింది. ఈ విజయానికి దేశమే పులకించిపోయింది. ఆనందోత్సాహాలు మిన్నుముట్టగా దేశప్రజలంతా 'జయహో..ఇస్రో' అని నినదిస్తూ.. మన శాస్త్రవేత్తల అపూర్వవిజయాన్ని శ్లాఘిస్తూ.. అభినందనలతో ముంచెత్తారు. ఏదేమైనా ఈ విజయం అపూర్వం..అమోఘం..అద్భుతం!..

'శ్రీహరికోట'... శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఒకప్పుడది మారుమూల ప్రాంతం. ఇప్పుడది దేశఖ్యాతిని ఇనుమడించే విజ్ఞాన సుక్షేత్రంగా మారింది. శ్రీహరికోటలోని షార్ నుంచి చిన్న చిన్న రాకెట్లను పంపే దశ నుంచి.. ఇప్పుడు ఏకంగా ప్రపంచాన్నే ఆశ్చర్యపరిచే ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానంతో.. అద్భుత ప్రయోగాలతో రాణిస్తూ.. విశ్వవ్యాప్తమవుతోంది. ఏకంగా 104 ఉపగ్రహాలను సైతం అంతరిక్షంలోకి విజయవంతంగా పంపి ఇస్రో తన విశ్వరూపాన్ని ప్రపంచానికి చాటింది. 2013లో అమెరికా ఒకే రాకెట్ ద్వారా 29 ఉపగ్రహాలు, 2014లో రష్యా ఒకే రాకెట్ ద్వారా 37 ఉపగ్రహాలను పంపి రికార్డు సృష్టించాయి. గత ఏడాది జూన్‌లో ఇస్రో కూడా ఒకే రాకెట్ ద్వారా తొలిసారిగా 20 ఉపగ్రహాలను విజయవంతంగా పంపి అగ్రదేశాల సరసన చేరింది. ఇప్పుడు అటు అమెరికా, రష్యా రికార్డులను సైతం బద్దలుకొడుతూ ఒకే రాకెట్ ద్వారా ఏకంగా 104 ఉపగ్రహాలను విజయవంతంగా రోదసిలోకి పంపి భారత్ తన సత్తా చాటుకుంది. అంతేకాదు, ఈ 104 ఉపగ్రహాల్లో భారత్‌కు చెందిన మూడు ఉపగ్రహాలతోపాటు, అమెరికాకు చెందిన 96 ఉపగ్రహాలు కూడా వుండడం విశేషం. ఇంకా స్విట్జర్ ల్యాండ్,యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇజ్రాయిల్, నెదర్‌ల్యాండ్స్, కజకిస్తాన్ దేశాలకు చెందిన ఉపగ్రహాలు కూడా వున్నాయి. అందుకే, ఇప్పుడు ప్రపంచమంతా భారత్‌వైపే చూస్తోంది. తక్కువ ఖర్చుతో..ఖచ్చితమైన రీతిలో తమ ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చగలుగుతున్న భారత్ పట్ల ప్రపంచదేశాలు మొగ్గుచూపుతున్నాయి. ఇస్రోకి ఈ ప్రయోగాలు వాణిజ్యపరంగా ఎంతో ఆదాయం చేకూర్చేవి కూడా. అందులోనూ పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో, సొంతకాళ్లపై నడుస్తున్న ఇస్రో రథం.. ఇప్పుడు సరికొత్త విజ్ఞానాన్ని సొంతంగానే సమకూర్చుకుని అద్భుత విజయాలు సాధిస్తుండడం ఎంతైనా విశేషం.

అయితే, ఈ విజయం ఈనాటిదేమీ కాదు.. వైఫల్యాల నుంచి ఎలా తట్టుకుని గెలవాలో ఇస్రోని చూసి నేర్చుకోవాలి. వైఫల్యాలు ఎదురైనప్పుడు కుంగిపోక అపజయాలను విజయాలకు సోపానాలుగా మార్చుకోవడం ఇస్రో ఆత్మవిశ్వాసానికి ప్రతీక. 1979లో షార్ నుంచి ప్రయోగించిన తొలితరం రాకెట్ ఎస్ఎల్వి వైఫల్యం చెందడంతో శాస్త్రవేత్తలు అప్పట్లో ఎంతో ఆవేదనకు గురయ్యారు. ఆ తర్వాత మరో మూడు రాకెట్లను ప్రయోగిస్తే రెండు మాత్రమే విజయం సాధించాయి. ఆ తర్వాత ఏఎస్ఎల్వి రాకెట్ సైతం అపజయమే మిగిల్చింది. ఇలా 1994 దాకా నాలుగు రాకెట్లను ప్రయోగించినా కేవలం ఒక్కటి మాత్రమే విజయవంతమైంది. ఆ తర్వాత పిఎస్ఎల్వి రాకెట్ కూడా తొలిప్రయోగంలోనే విఫలమైంది. అయినప్పటికీ నిరంతర కృషి, పట్టుదలతో.. విజయం సాధించాలనే ఏకైక లక్ష్యసాధనతో మన శాస్త్రవేత్తలు అత్యద్భుతమైన రీతిలో పిఎస్ఎల్వి రాకెట్‌ను రూపొందించారు. ఇదే ఇప్పుడు ఇస్రోకి వరమైంది. 1996నుంచి వరుస విజయాలు సాధిస్తూ పిఎస్ఎల్వి రాకెట్ ఇస్రో అమ్ములపొదిలో ఒక బ్రహ్మాస్త్రంలా మారింది. ఇప్పటిదాకా 38 పిఎస్ఎల్వి రాకెట్లను అంతరిక్షంలోకి పంపితే, అందులో మొదటిది ఒక్కటి మినహా అన్నీ విజయవంతం కావడం విశేషం. ఇస్రో ప్రారంభమైనప్పటినుంచి ఇప్పటిదాకా 88 స్వదేశీ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపింది. అంతేకాదు, 22 దేశాలకు చెందిన 79 ఉపగ్రహాలను పిఎస్ఎల్విల ద్వారా ప్రయోగించింది. ఇప్పుడు ఏకంగా పిఎస్ఎల్వి సి-37 ద్వారా104 ఉపగ్రహాలను నింగిలోకి పంపి అగ్రదేశాలనే అధిగమించడంతో భారతశాస్త్రవేత్తల అంతరిక్ష పరిజ్ఞానానికి ప్రపంచమే నివ్వెరపోతోంది.

ఈ విజయంతో ఒకేరాకెట్ ద్వారా 226 ఉపగ్రహాలను పంపే మరో అమోఘ ప్రయోగానికి కూడా ఇస్రో సన్నద్ధమవుతోంది. భవిష్యత్తులో మిషన్ వీనస్, మిషన్ ఆదిత్య, మార్స్ మిషన్, చంద్రయాన్-2 తదితర మహత్తర ప్రయోగాలతో సూర్య శోధనకు, చంద్రునిపై పరిశోధనలకు.. మొత్తంగా విశ్వశోధనకు రంగం సిద్ధం చేస్తోంది. మానవాళికి బృహత్తర ప్రయోజనాలు చేకూర్చే ఇలాంటి మహత్తర ప్రయోగాలతో ఇస్రో భరతజాతి ఖ్యాతిని జగద్విదితం చేస్తోండడం దేశానికే గర్వకారణం.. ఇస్రో ఇలా ఇంకా.. ఇంకా మరెన్నో ఘనవిజయాలు సాధించాలని మనసారా కోరుకుందాం... **'జయహో ఇస్రో'.. జయహో భారత్'!...**

## జయహో! ఇస్రో



ఒకే రాకెట్..104 ఉపగ్రహాలు!.. నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకువెళ్ళిన పిఎస్ఎల్వి-సి37 దిగ్విజయంగా కక్ష్యలోకి చేరి అద్భుత విజయాన్ని సాధించింది. భారత్‌కు అఖండకీర్తిని అందిస్తూ..గగనవీధుల్లో భారత్ జయపతాకను ఇస్రో మరోసారి రెపరెపలాడించిది. ఈ అమోఘ విజయానికి దేశమే పులకించిపోయింది. సంతోష సంరంభాలు మిన్నుముట్టగా దేశప్రజలంతా ముక్తకంఠంతో 'జయహో.. ఇస్రో' అంటూ మనసారా అభినందిస్తూ.. శుభాకాంక్షల దీవెనలందజేస్తున్నారు.

### లోక్‌అదాలత్‌తో...

## కేసుల సత్వర పరిష్కారం

**- నెల్లూరుజిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్‌అహ్మద్ మౌలానా**



పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్నామని నెల్లూరుజిల్లా ప్రధానన్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ ఛైర్మెన్ జునైద్ అహ్మద్ మౌలానా పేర్కొన్నారు. శనివారం జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్‌అదాలత్ జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జీలు శ్యామలాదేవి, పాపిరెడ్డి, రామచంద్రమూర్తి, శ్రీలక్ష్మి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి టి.వి.సుబ్బారావు, భూపాల్‌రెడ్డి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సత్యవాణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శోభారాణి, నెల్లూరులోని పలు కోర్టుల న్యాయమూర్తులు, బ్యాంక్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



## నేత్రదానం

నెల్లూరు నగరంలోని పెద్దబజార్ నివాసి ముడియం ఆదిలక్ష్మి(61) ఇటీవల పరమపదించగా, కుటుంబసభ్యుల కోరిక మేరకు డాక్టర్ పిఎల్ రావు ఆధ్వర్యంలో ఆమె నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా నేత్రదాన మోటివేటర్ బయ్యా ప్రసాద్ మాట్లాడుతూ, నేత్రదానం ద్వారా మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు ప్రసాదించవచ్చన్నారు. నేత్రదానానికి సహకరించిన ఆదిలక్ష్మి భర్త ముడియం రంగయ్య, ఆమె కుమారులు సతీష్, శ్రీధర్ తదితర కుటుంబసభ్యులందరికీ ఈ సందర్భంగా ఆయన తన ధన్యవాదాలు తెలిపారు.




## రాజ్యాంగమా? ప్రజారక్షణా?

తమిళనాడు రాజకీయ సంక్షోభంలో గవర్నర్ విద్యాసాగర్‌రావు పాత్ర చాలా కీలకం కానుంది. ఆయన అటు రాజ్యాంగాన్ని రక్షించాలి, ఇటు ప్రజాభిప్రాయాన్ని చూడాలి! ఒక్కోసారి పరిస్థితులు మారినప్పుడు రాజ్యాంగంలోని సూత్రాలను కూడా పూర్తిగా అమలు చేయడం సాధ్యం కాకపోవచ్చు. గత తమిళనాడు ఎన్నికల్లో జయలలితను ముఖ్యమంత్రిగా కొనసాగించాలనే ఆ రాష్ట్ర ప్రజలు తీర్పిచ్చారు. అంతేగాని తమిళ ప్రజలు శశికళను ముఖ్యమంత్రిగా కోరుకోలేదు. అలాగే పన్నీరు సెల్వంను కూడా కోరుకోలేదు. కాని ఈ సంక్షోభ సమయంలో నాయకుల వ్యక్తిత్వాన్ని కూడా చూడాలి. శశికళ అక్రమాస్తుల కేసులో నిందితురాలు. తమిళనాడులో మద్యం, ఇసుక మాఫియా ఆమెదే! అక్రమంగా వేలకోట్ల ఆస్తులు సంపాదించింది. ఇలాంటివాళ్ళు సీఎం అయితే వాళ్ళ ప్రాధాన్యతలు ఎలా వుంటాయో ఊహించవచ్చు. పన్నీర్ సెల్వం ప్రజానాయకుడు కాకపోయినా, అవినీతి ఆరోపణలు లేని నాయకుడు. వివాదరహితుడు. కాబట్టి గవర్నర్ అటు రాజ్యాంగంతో పాటు ఇటు నాయకుల వ్యక్తిగత గుణాలను కూడా లెక్కలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

**పి.బాలసుబ్రహ్మణ్యం, మీంజూరు.**

## మాటలా?.. నీటి మూటలా?

ఏనాడూ ఎక్కని దిష్టిగుర్రమెక్కినట్లుగా రాజకీయ నాయకుల పొట్లుంటాయి. గాంధీ జయంతి నాడు ఆయన ఆశయాలు పాటిస్తామంటారు. సర్దార్ పటేల్ పటానికి దండేసి ఆయన ధైర్య సాహసాలు తమకు స్ఫూర్తిదాయకమంటారు. పొట్టి శ్రీరాములు బొమ్మకు పూలు చల్లి ఆయనలాగా నిరాడంబరంగా ఉంటామంటారు. నెహ్రూ శిలకు దండలు వేసి ఆయన చూపిన బాటలో నడుస్తామంటారు. పూలే బొమ్మకు పూలు జల్లి బి.సిల సంక్షేమానికి పాటు పడతామంటారు. కాని రాజకీయ నాయకులు ఒక్కరన్నా ఆచరిస్తున్నారా? అవినీతిని మానుతున్నారా? వీళ్ళు ఇలాంటి కూతలు మాని బుద్ధిగా జయంతి, వర్ధంతులకు దండలు వేసి కామ్‌గా పోతే మేలు. **– వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## తిరుగులేని ఇస్రో

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రోకు ఇక తిరుగులేదు. ప్రపంచ అగ్ర దేశాలకు సైతం వీలుకాని విధంగా ఒకేసారి 104 ఉపగ్రహాలు నింగిలోకి తీసుకెళ్ళి వాటి వాటి కక్ష్యల్లోకి వదిలిన ఇస్రో శాస్త్రవేత్తలను ఎంత పొగిడినా తక్కువే! ఇప్పటి వరకు ఒకేసారి 37ఉపగ్రహాలను వదిలి రష్యా ముందు నిలువగా, ఊహకందని విధంగా ఒకేసారి 104ఉపగ్రహాలను ఇస్రో నింగిలోకి వదిలి ప్రపంచ రికార్డు సృష్టించడం భారతీయులందరికీ గర్వకారణం.

**జె.యస్.కృష్ణ, నెల్లూరు.**

## ఇదేనా మహిళా సాధికారత!

మహిళా పార్లమెంటేరియన్ సదస్సుకు వస్తున్న వైకాపా ఎమ్మెల్యే ఆర్.కె.రోజాను తెలుగుదేశం ప్రభుత్వం అరెస్ట్ చేయించిన తీరు పరమ జుగుప్సాకరంగా ఉంది. రోజా తీవ్రవాది కాదు. నడుంకు బెల్టుబాంబు కట్టుకోలేదు. మరి ఆమెను చూసి ఎందుకు భయపడాలి. ఒకవేళ సదస్సులో ఆమె పాల్గొంటే ఈ ప్రభుత్వంలో మహిళలపై జరిగిన దాడులను గురించి ప్రస్తావించి ఉండేదేమో! వాటికి ప్రభుత్వం సమాధానం చెప్పుకోవాలి. ఒక మహిళా ఎమ్మెల్యేకే భయపడే ప్రభుత్వానికి అసలు ఈ మహిళా పార్లమెంట్‌ను నిర్వహించే అధికారముందా?

**పి.కె.రాజేశ్వరి, కావలి.**





## కోవూరు దేశంలో...

# వర్గపోరు!

*జిల్లా రాజకీయాలలోనే కోవూరుకు ప్రత్యేక గుర్తింపు వుంది. ఈరోజు కాదు, ఏ రోజునుండో ఇది అభివృద్ధి చెందిన ప్రాంతం. వడ్లకు, బలిసిన రెడ్లకు పేరు. చైతన్యవంతులైన ప్రజలున్నారు. విద్యాధికులు అధికం. పాడిపంటలతో అలరారుతున్న ప్రాంతం. అభివృద్ధి పరంగా ఎంత ముందుందో రాజకీయ చైతన్యంలోనూ అంతే ముందుంటుంది.*

అలాంటి నియోజకవర్గం కేంద్రంగా ఇప్పుడు రాజకీయాలు రోజుకో కొత్త రూపం సంతరించుకుంటున్నాయి. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీలో మూడు ముక్కలాట మొదలైంది. 2004ఎన్నికల్లో ఊహించని విధంగా తెలుగుదేశం నుండి కాంగ్రెస్‌లోకి మారిన పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి సంచలనాత్మక రీతిలో ఎమ్మెల్యేగా గెలవడం తెలిసిందే! అదే సంచలనాత్మక రీతిలో ఆయన 2014లోనూ అదే సీన్ రిపీట్ చేసాడు. అయితే ఈసారి కాంగ్రెస్ నుండి తెలుగుదేశంలో దూరి ఎమ్మెల్యేగా గెలిచాడు. 2014 ఎన్నికల్లో కోవూరు సీటు కోసం స్థానిక తెలుగుదేశం నాయకులు పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ చివరి నిమిషంలో పార్టీలో చేరిన పోలంరెడ్డి ఆ సీటును ఎగరేసుకుపోయాడు.

ఎన్నికలు ఇక రెండేళ్ళలో ఉన్నాయి. ఇప్పుడే సీటు ఎవరికని చెప్పలేరు. కాని, ఈసారి టిక్కెట్ టార్గెట్‌గా వర్గపోరు మొదలైంది. ముఖ్యంగా ఇటీవల పోలంరెడ్డి మీదవచ్చిన ఆరోపణలు, మీడియాలో వచ్చిన వ్యతిరేక కథనాల నేపథ్యమైతేనేమీ, జిల్లాలో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు సీట్లిస్తే గెలవరని కొన్ని వర్గాలు ఇచ్చిన నివేదిక వల్లనైతేనేమీ చంద్రబాబు ఈసారి పోలంరెడ్డికి సీటివ్వడన్న ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. దీనికి తగ్గట్లే ఇటీవల ఏపిఐఐసి ఛైర్మెన్ పి.కృష్ణయ్య కోవూరు నియోజకవర్గ వ్యవహారాలలో ఎక్కువుగా తల దూరుస్తుండడం కూడా అనుమానాలకు తావిస్తోంది. అదే సమయంలో గత ఎన్నికల్లో సీటును మిస్సయిన పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి వచ్చే ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనైనా పోటీ చేయాలనే పంతంతో ఉన్నట్లు తెలుస్తోంది. కోవూరు నియోజకవర్గంలో 'రెడ్ల' ఆధిపత్యం ఎక్కువ. పి.కృష్ణయ్య, లేదా ఇతర బి.సి వర్గాల నాయకులు ఇక్కడ తట్టుకుని నిలబడడం కష్టం. వైకాపా నుండి 'రెడ్లు' నిలబడకుండా పి.కృష్ణయ్య, లేదా ఇంకొకరికి సీటిచ్చినా ఇబ్బంది ఉండదు. ఈ నియోజకవర్గంలో 'రెడ్డి' అభ్యర్థిని మోటుకోవాలంటే ప్రత్యర్థిగా రెడ్డి అభ్యర్థే ఉండాలి. కాబట్టి పి.కృష్ణయ్య లాంటి ప్రయోగాలు ఇక్కడ సక్సెస్ కావు. అలా చేయడమంటే 2009ఎన్నికల్లో ఇక్కడ ప్రజారాజ్యం అభ్యర్థిగా చిరంజీవి, తుపాకుల మునెమ్మను దించినట్లే వుంటుంది. కాబట్టి ఏ పార్టీకైనా ఇక్కడ అభ్యర్థి ఎంపికలో 'రెడ్ల'కే ప్రాధాన్యత ఇవ్వక తప్పదు.



## అజీజ్ ఉంటే రెండు నియోజకవర్గాల్లో పార్టీ దెబ్బ తినడం ఖాయమంటున్న నాయకులు

# మేయర్ కుర్చీకి ఎసరు?

*నెల్లూరు మేయర్ అజీజ్ వైఖరిపై తెలుగుదేశం నాయకులు అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఇక అజీజ్‌ను కొనసాగిస్తే నగరంలో తెలుగుదేశం మనుగడ సాగించడం కష్టమనే భావం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. అజీజ్ ఒంటెత్తు పోకడల మూలంగా నెల్లూరు నగరం, రూరల్ నియోజకవర్గాల్లో కొన్ని వర్గాల ప్రజలు పార్టీకి దూరమవుతున్నారని నాయకులు వాపోతున్నారు.*

ముఖ్యంగా మేయర్ అజీజ్ వైఖరితో నగరంలో పార్టీ నష్టపోతుందని ఆందోళన చెందుతున్నారు. నెల్లూరు కార్పొరేషన్‌ను అవినీతికి నమూనాగా మార్చారు. సామాన్య ప్రజలకు పైసలివ్వందే పనులు కావడం లేదు. టౌన్‌ప్లానింగ్‌లో పనులు చేయించుకోవాలంటే తలప్రాణం తోకలోకి వస్తోంది. కార్పొరేషన్‌లో ప్రతిపనికి ఒక రేటు కట్టేసారు. మేయర్ అజీజ్ సోదరుడు జలీల్ కేంద్రంగా అవినీతి సామ్రాజ్యం నడుస్తోందనే ఆరోపణలున్నాయి. అలాగే ప్రతి విభాగానికి నెలకు ఇంత అని అవినీతి సొమ్ము టార్గెట్ పెట్టారని తెలుస్తోంది. ఇక పింఛన్‌లు, ఋణాలు వంటివాటి మంజూరు విషయంలో అజీజ్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు, ఋణాల పంపిణీ విషయంలో నగర, రూరల్ ఇన్‌ఛార్జులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డిలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి నారాయణ చేసిన సూచనలను కూడా అజీజ్ లెక్కపెట్టలేదు. నగరంలో కార్పొరేషన్ పరంగా పెద్దగా అభివృద్ధి పనులు కూడా జరగడం లేదు. కనీసం చెత్తా, చెదారం పనులు కూడా సక్రమంగా చేయడం లేదు. ఇప్పుడు అజీజ్ తెలుగుదేశం మేయర్ క్రింద లెఖ్ఖ! కార్పొరేషన్ జమానాలో జరిగే అవినీతి అక్రమాలన్నీ కూడా తెలుగుదేశం ఖాతాలోనే పడుతున్నాయి. ఇదంతా తెలుగుదేశంకు నష్టం కలిగించే ప్రక్రియే! అజీజ్ వైకాపా మేయర్‌గానే ఉండుంటే తెలుగుదేశంపై ఈ ప్రభావం ఉండేది కాదు.

నెల్లూరు మేయర్ పనితీరు వల్ల నగరం, రూరల్ నియోజకవర్గాలలో పార్టీకి కొంచెమన్నా ఉపయోగం ఉండాలి. కాని, అజీజ్ చర్యలతో పార్టీ నష్టపోతోంది. ఈసారి అసెంబ్లీ ఎన్నికల తర్వాత స్థానిక ఎన్నికలుండొచ్చు. అసెంబ్లీ ఎన్నికల దాకా అజీజ్‌నే మేయర్‌గా కొనసాగిస్తే ఈ రెండు నియోజకవర్గాలలోనూ పార్టీ దెబ్బతింటుంది. పార్టీకి కార్పొరేషన్‌లు, మున్సిపాల్టీలు, జడ్పీలకన్నా కూడా అసెంబ్లీలు ముఖ్యం. నగరం, రూరల్‌లో తెలుగుదేశం బలహీనంగా వుంది. గత ఎన్నికల్లో ఈ రెండు సీట్లు కోల్పోయింది కూడా! ఈసారి రెండింటిలో ఒక్కటన్నా గెలుచుకోవాలి. ఈసారి కూడా ఎన్నికలు గట్టిపోటీ మధ్యే వుంటాయి. కాబట్టి ప్రతి అసెంబ్లీ మీద పెద్ద కసరత్తే చేయాల్సి వుంటుంది. కాని ఇక్కడ అజీజ్ వైఖరి వల్ల ఈ రెండు నియోజకవర్గాల పరిధిలో కొన్ని వర్గాలవారు పార్టీకి దూరమవుతున్నారు. అట్లాగని అజీజ్ మూలంగా పార్టీకి ముస్లింలు దగ్గరయ్యారా అంటే అదీ లేదు. ఈసారి తెలుగుదేశం ఎమ్మెల్యే టిక్కెట్ అజీజ్‌కు ఇచ్చినా కూడా ముస్లింలు వైకాపా వైపే నిలుస్తారు. ఆయా ప్రాంతానికి మిగిలిన వర్గాలను దూరం చేసుకోవడమెందుకనే ఆలోచనలో తెలుగుదేశం అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీకి నష్టం కలిగించే విధంగా ఆయన వైఖరి ఉంది. ఇదే విధంగా కొనసాగిస్తే, ఆయనను మేయర్ కుర్చీ నుండి పంపించే ప్రయత్నం కూడా జరగొచ్చు.

# సీటుపై పీటముడి





నెల్లూరు స్థానిక శాసనమండలి నియోజకవర్గం సీటు ఎవరికివ్వాలన్న అంశంపై తెలుగుదేశం పార్టీలో ప్రతిష్టంభన కొనసాగుతోంది. తర్జనభర్జనలు జరుగుతున్నాయి. ఎన్నికలకు సంబంధించి ఇంకా నోటిఫికేషన్ వెలువడకపోవడంతో పార్టీ అధిష్టానం దీనిపై అంత అర్జంట్‌గా దృష్టిపెట్టాల్సిందేమీ లేదు. కాకపోతే సీటు విషయంలో మొదటి నుండి రేస్‌లో వున్న వాకాటి నారాయణరెడ్డికి దారులు బిగుసుకుపోతున్నట్లుగా వుంది. స్థానిక ఎమ్మెల్సీ సీటు నాదేనని ఆయన మొదటి నుండి ధీమాతో వున్నాడు. ఈమేరకు ప్రచారం కూడా మొదలుపెట్టాడు.

అదే సమయంలో వాకాటి ప్రయత్నాలకు గండికొట్టేలా స్థానిక ఎమ్మెల్సీ సీటు నాక్కావాలంటూ ఆదాల ప్రభాకర్‌రెడ్డి రంగంలోకి దిగాడు. దీంతో ఎమ్మెల్సీ అభ్యర్థిని ఏకపక్షంగా నిర్ణయించే అవకాశం లేకుండా పోయింది.

అదీగాక నెల్లూరుజిల్లా స్థానిక ఎమ్మెల్సీని ప్రతిపక్ష వైకాపా కూడా సీరియస్‌గా తీసుకుంటోంది. ఇక్కడ బలమైన అభ్యర్థిని రంగంలోకి దించాలని వై.యస్.జగన్మోహన్‌రెడ్డి సూచించాడు. స్థానిక ఓట్ల పరంగా చూస్తే టీడీపీకి వైసిపికి వంద ఓట్లే తేడా! అది కూడా ఒకప్పుడు వైసిపికే మెజార్టీ ఓట్లుండేవి. తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక వైసిపికి చెందిన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు వందమంది దాకా తెలుగుదేశంలో చేరారు. తెలుగుదేశం నుండి దిగే అభ్యర్థి బలహీనంగా వుంటే ఈ ఓట్లు అటు ఇటూ తారుమారు కావడం పెద్ద సమస్య కాదు. వాకాటి నారాయణరెడ్డి అభ్యర్థి అయితే తెలుగుదేశం ఓటర్లే కొంప ముంచుతారనే సంకేతాలు చంద్రబాబు వరకు వెళ్లాయి. వాకాటి అంటే తెలుగుదేశంలో చాలామందికి పడదు. అదీగాక తమ పార్టీ అభ్యర్థే అయినా ఓటర్లు డబ్బులు ఆశిస్తారు. వాకాటి ఇప్పుడు అంత భరించగలడా అన్నది అనుమానమే! వాకాటికి ధీటైన అభ్యర్థిని రంగంలోకి దించడం వైకాపాకు పెద్దసమస్య కాదు. తెలుగుదేశం టిక్కెట్ వాకాటికిస్తే, వైకాపా నుండి పోటీ చేయడానికి నాయకులు ఉత్సాహం చూపే అవకాశముంది.

వాకాటి అభ్యర్థి అయితే అసలుకే మోసం వచ్చే అవకాశాలుండడంతో చంద్రబాబు ప్రత్యామ్నాయ అభ్యర్థిపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఆదాల ప్రభాకర్‌రెడ్డి సీటును ఆశిస్తున్నప్పటికీ ఆనం రామనారాయణరెడ్డి వైపు చంద్రబాబు, మంత్రి నారాయణలు మొగ్గు చూపిస్తున్నట్లు తెలుస్తోంది. ఆనం రామనారాయణరెడ్డి అయితే జిల్లా పార్టీపై వాళ్లకు పట్టు వస్తుంది. పార్టీ కూడా పుంజుకుంటుందనే ఉద్దేశ్యంతో చంద్రబాబు ఉన్నట్లు తెలుస్తోంది. మరి తనకంటే వెనుక పార్టీలోకి వచ్చిన వాకాటికి సీటిస్తే ఒప్పుకునేది లేదంటున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మరి వాకాటికన్నా తర్వాత పార్టీలోకి వచ్చిన ఆనం రామనారాయణరెడ్డి సీటు ఎగరేసుకుపోతే ఊరుకుంటాడా?

# దడ పుట్టించిన శ్రీధర్‌రెడ్డి



నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఈ నెల 11వ తేదీన నెల్లూరులోని వైయస్ఆర్ నగర్‌కు వెళ్ళారు. అక్కడ హౌసింగ్ కార్యాలయం ముందు ఎర్రటి ఎండలో బారులు తీరి నిల్చునివున్న మహిళల అవస్థను గమనించారు. అది చూసి ఆయనకు అరికాల్లో మండింది. లబ్దిదారుల కోసం కనీసం షామియానా కూడా వేయరా, వాళ్లంటే లెక్కలేదా అని కారాలు మిరియాలు నూరుతూ అక్కడే కూర్చుని నిరసన ధర్నాకు దిగారు. దీంతో అధికారులకు దడపుట్టి అప్పటికప్పుడు షామియానాలు తెప్పించి వేయించి, మహిళలకు మంచినీళ్ళ పొట్లాలు కూడా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా వేలమంది పేదోళ్లు సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు నానా తిప్పలు పడుతున్నారని, తీరా ఆశలను సాకారం చేసుకునే సమయంలో గందరగోళం సృష్టిస్తున్నారని విమర్శించారు. ఒకే ఇంటిని ఇద్దరికి కేటాయించి వారిమధ్య తగవులు పెడుతున్నారని, ఇప్పటికే డబ్బులు చెల్లించిన వేలాదిమంది లబ్దిదారుల ఇళ్లను రద్దు చేసినట్లు బోర్డులు పెడుతున్నారని, ఇదేం పద్ధతని ప్రశ్నించారు. వైయస్ఆర్ నగర్‌లో ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ఇళ్ల కేటాయింపులు, ఇళ్ల తాళాల పేరుతో కొందరు దళారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసిందని, ఇలాంటి దళారుల అంతు చూస్తానని హెచ్చరించారు. అలాగే వైయస్సార్‌నగర మెయిన్‌రోడ్డులో నిర్మాణం జరుగుతున్న షాపింగ్ కాంప్లెక్స్ అక్రమమా లేక సక్రమమా అన్నది తనకు తెలియజేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# నెల్లూరు కబుర్లు



## మంత్రితో బ్రదర్స్!

ఆనం వివేకానందరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డిలు 13వ తేదీ విజయవాడలో మున్సిపల్ మంత్రి పి.నారాయణను మర్యాదపూర్వకంగా కలిసారు. జిల్లా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి గెలుపు కోసం చేయాల్సిన పనులపై మాట్లాడుకున్నారు.

ఆరు దశాబ్దాల రాజకీయ అనుభవం... ఇంటి నిండా కొమ్ములు తిరిగిన నాయకులు... ఒకే ఇంటి నుండి నలుగురు మంత్రులుగా పనిచేసిన కుటుంబం... చివరకు చదువుతో వ్యాపారం, రాజకీయం చేసుకునే నారాయణ వద్దకు పోతున్నారు చూడండి. విధి వైపరీత్యం.

## సింగం-3లో నెల్లూరు!



సూర్య, అనుష్క, శృతిహాసన్‌లు హీరోహీరోయిన్‌లుగా నటించిన సింగం-3 తెలుగు వెర్షన్ నెల్లూరులోని ఎస్-2, ఎం.జి మాల్ స్క్రీన్‌లలో విడుదలైంది. ఈ సినిమా విశేషం ఏంటంటే కొన్ని సీన్‌లను నెల్లూరు జిల్లాలో చిత్రీకరించడం. ఈ సినిమాలో చూపించిన మంగుళూరు పోర్టు వాస్తవానికి కృష్ణపట్నం పోర్టే! పోర్టు సీన్‌లన్నీ కూడా కృష్ణపట్నం పోర్టులోనే తీసారు. కాకపోతే కథ అంతా మంగుళూరు కేంద్రంగా నడుస్తుంది కాబట్టి అది మంగుళూరు పోర్టుగా చిత్రీకరించారు. అలాగే నెల్లూరు, మాగుంట లే అవుట్‌లో సెలబ్రేషన్స్ హోటల్ ప్రాంతంలో స్కూలు బస్సుపై రౌడీలు దాడి చేయడం, కె.వి.ఆర్ పెట్రోల్ బంకు సెంటర్, అచ్యుత సుబ్రహ్మణ్యం కళ్యాణ మండపంలోని బావి వద్ద సీన్‌లు ఈ సినిమాలో వున్నాయి.

## ఉచిత మెగా వైద్యశిబిరం




నెల్లూరులోని విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న ఉచిత మెగా వైద్యశిబిరం జరిగింది. ప్రముఖ డయాబెటాలజిస్ట్ డాక్టర్ పెన్నా సుధాకరరెడ్డి ఆధ్వర్యంలో ఈ వైద్యపరీక్షలు జరుగగా, దాదాపు 250 మందికి పైగా పాల్గొని ఆరోగ్యపరీక్షలు చేయించుకున్నారు. విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పట్టాభిరామిరెడ్డి మాట్లాడుతూ, వాకర్స్ అసోసియేషన్ ద్వారా ప్రతినెలా ఆఖరి వారంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తామని, వాకర్స్‌తో పాటు ఇతరులు కూడా దీనిని సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వి. నాగేశ్వరరావు, కోశాధికారి తులసి వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షులు డాక్టర్ సి.భాస్కరరావు, డాక్టర్ ఏ.పెంచలయ్య, మహిళా వాకర్స్ అధ్యక్షురాలు అనూరాధ, న్యూట్రిషనిస్ట్ ఎల్.మాధవి తదితరులు పాల్గొన్నారు.

# కళ తగ్గిన ఏ.సి సెంటర్!



నెల్లూరు నగర రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ ఏ.సి.సెంటర్. నగరంలోని రాజకీయ చర్చలన్నీ ఇక్కడే ఉండేవి. చాలా మంది నాయకులూ ఇక్కడే ఉండేవాళ్లు. ఇక్కడే రాజకీయ పాఠాలు నేర్చుకునేవాళ్లు. దాదాపు 20ఏళ్ల పాటు నెల్లూరులో ఇదొక రాజకీయ ట్రైనింగ్ క్యాంపుగా నడిచింది. ఈ క్యాంపుకు ఆనం వివేకానందరెడ్డి మాష్టార్‌గా వ్యవహరించేవాడు. ఏసి సెంటర్‌లోని ఆనం కార్యాలయం ఎప్పుడూ చిన్నాచితక నాయకులతో, కార్యకర్తలతో సందడిగా ఉండేది. ప్రెస్‌మీట్‌లు, పార్టీ మీటింగ్‌లతో ఎప్పుడూ వార్తల్లో కనిపించేది. ఈ ఆఫీసులో 24-7 డ్యూటీ అన్నట్లు ఆనం వివేకానందరెడ్డి ఉండేవాడు. ఒకవేళ ఆయన హైదరాబాద్‌కో, మరెక్కడికన్నానో పోతే ఇక్కడ ఆయన సోదరులు ఆనం జయకుమార్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డిలు కుర్చీవేసుకుని కూర్చుని వచ్చిపోయేవాళ్లతో మాట్లాడుతుండేవాళ్లు. మరో సోదరుడు, మాజీమంత్రి అయిన ఆనం రామనారాయణరెడ్డి అప్పుడప్పుడు మాత్రమే ఈ సెంటర్‌కొచ్చి కూర్చుండేవాడు.

రెండు దశాబ్దాల పాటు ఓ వెలుగు వెలిగిన ఈ సెంటర్ గత మూడేళ్లుగా కళావిహీనమైంది. రాజకీయ చర్చలు లేవు, రాజకీయ రచ్చలు లేవు, ప్రెస్‌మీట్లు, పార్టీ మీటింగ్‌లు ఎప్పుడోగాని లేవు. ఆరోగ్య కారణాలతో ఆనం వివేకానందరెడ్డి చాలా తక్కువగా నెల్లూరులో ఉంటున్నారు. ఇక 2014ఎన్నికలకు ముందే ఒక సోదరుడు ఆనం జయకుమార్‌రెడ్డి తన అన్నతో విభేదించి ఈ సెంటర్‌కు రావడమే మానుకున్నాడు. కాగా, ఏడాది క్రితం ఇంకో సోదరుడు ఆనం విజయకుమార్‌రెడ్డి కూడా తన అన్నకు దూరమై వైకాపాలో చేరడం తెలిసిందే! ఆయన కూడా ఈ సెంటర్ వైపు రావడం తగ్గించాడు. ఇక ఆనం రామనారాయణరెడ్డి పెద్దగా రాడు. ఆనం సోదరులు నలుగురు కూడా ఈ సెంటర్‌లో ఉండక పోతుండడంతో... ఈ సెంటర్ కళావిహీనంగా కనిపిస్తోంది.

## హైదరాబాద్‌కు ఎక్కేవాళ్ళు తగ్గారు

రాష్ట్ర విభజనకు ముందు రాత్రిపూట రైల్వేస్టేషన్‌లు చూస్తే తెల్లపంచెలు, తెల్ల ఫ్యాంట్లు వేసుకుని చేతిలో సూట్‌కేసులు పట్టుకున్న నాయకులు చాలామంది కనిపించేవాళ్లు. ముఖ్యంగా రాత్రిపూట ఒకటి, రెండు ప్లాట్‌ఫారాలు ఈ తెల్లపంచెలు, ఫ్యాంట్లుబాబులతో ధగధగ మెరిసిపోతుండేది. కొందరు ప్రజాప్రతినిధులైతే, ఇంకొందరు వారి అనుచరులు, మరికొందరు మంత్రులతోనో, సెక్రటేరియట్‌లోనే పని వుందని రైలెక్కుతుండేవాళ్లు. రాత్రివేళ హైదరాబాద్ వెళ్లే చెన్నై, పద్మావతి, ఛార్మినార్, నారాయణాద్రి, సింహపురి ఎక్స్‌ప్రెస్‌లలో వీళ్లే ఎక్కువగా దిగుతుండేవాళ్లు. అప్పట్లో నెల్లూరుకంటే కూడా హైదరాబాద్ మా సొంతూరు అన్నట్లుగా ఉండేవాళ్ళు.

రాష్ట్ర విభజన తర్వాత పరిస్థితులే మారిపోయాయి. ముఖ్యంగా చంద్రబాబును కేసీఆర్ హైదరాబాద్ నుండి విజయవాడకు వెళ్లగొట్టాక తెల్లపంచెలు, ఫ్యాంట్ల వాళ్ళకు హైదరాబాద్ రైలెక్కే పనే లేకుండా పోయింది. అమరావతిని రాజధానిగా చేసుకోవడం, సచివాలయాన్ని కూడా ఇక్కడికే తరలించడం, మంత్రులు కూడా తట్టాబుట్టా సర్దుకుని ఇక్కడే గుడారాలు ఏర్పాటు చేసుకోవడంతో నెల్లూరు రైల్వేస్టేషన్‌లో రాత్రిపూట తెల్లఖద్దరు వస్త్రాల మెరుపులు తగ్గాయి. విజయవాడ, అమరావతిలకు నైట్ జర్నీ అవసరం లేదుకదా!



### కన్యకాపరమేశ్వరి ఆలయ ఎన్నికల్లో
## ద్వారకా ప్యానెల్ ఘన విజయం

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు ఆర్యవైశ్యుల కులదైవం. ఈ దేవస్థానం పాలకమండలి గత కొన్నేళ్లుగా ఏకగ్రీవంగా ఏర్పడుతూ వచ్చింది. అయితే ఈ సంవత్సరం మాత్రం ఎన్నికలు జరిగాయి. నెల్లూరు డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్ ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి ప్యానెల్, పోటీగా వాసవి మాతా ప్యానెల్ రంగంలోకి దిగాయి. ఈ వాసవి మాతా ప్యానెల్‌కు నగర టిడిపి ఇన్‌ఛార్జ్ ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి పరోక్ష మద్దతు ఉన్నట్లు సమాచారం. రెండు ప్యానెల్‌వాళ్ళు కూడా అసెంబ్లీ ఎన్నికలకు ధీటుగా ప్రచారం నిర్వహించారు. స్టోన్‌హౌస్‌పేట నిండా ఫ్లెక్సీలు కట్టారు. ఆదివారం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ద్వారకానాథ్ బలపరచిన ప్యానెల్ తరపు ఐదుగురు అభ్యర్థులు మంచి మెజార్టీలతో ఘన విజయం సాధించారు. అధ్యక్షుడిగా దాసా సురేష్‌రాజు, ఉపాధ్యక్షుడిగా సుంకు మనోహర్, కార్యదర్శిగా ఐతా రామచంద్రరావు, సహాయ కార్యదర్శిగా దొంతంశెట్టి వివేకానందం, కోశాధికారిగా పబ్బిశెట్టి శ్రీనివాసులు గెలుపొందారు. విజేతలను నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్, డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్‌లు అభినందించారు.

## బిజిఆర్ కళాశాలలో ఫేర్‌వెల్ డే





నెల్లూరులోని బెజవాడ గోపాలరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 11వ తేదీ ఫేర్‌వెల్ డే ఘనంగా నిర్వహించారు. డిగ్రీ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థినిలు, తృతీయ సంవత్సర విద్యార్థినిలకు వీడ్కోలు పలికారు. తృతీయ సంవత్సర విద్యార్థినులు కళాశాలలోని తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ జె.వి.రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు అబ్దుల్ కలాం, స్వామి వివేకానందలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రిన్సిపల్ మృదుల, సనత్‌కుమార్‌రెడ్డి, పూర్వప్రిన్సిపల్ సన్నపురెడ్డి రాఘవరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.

### నెల్లూరీయుడు నిర్మించిన...
## మనీ ఈజ్ హనీ




నెల్లూరు యువకుడు, ఒకప్పుడు జర్నలిస్టుగా పని చేసిన జాలె వాసుదేవనాయుడు నిర్మించిన చిత్రం 'మనీ ఈజ్ హనీ'. ఈ సినిమాను మార్చి మొదటి వారంలో విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాత అయిన వాసుదేవనాయుడు 'లాయర్'కు తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను దర్శకరత్న దాసరి నారాయణరావు ఆవిష్కరించగా, ఆలిండియా ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షులు, సినీ నిర్మాత సి.కళ్యాణ్ ఆదిత్య మ్యూజిక్ ద్వారా ఆడియోను విడుదల చేశారు. జనార్ధన్ శివలంకి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో జె.వి.నాయుడు, రోషన్, వెంకీ, ఆషిక్, రచనాస్మిత్ ప్రధాన పాత్రలు పోషించారు. ప్రతిమనిషికి ఆపత్కాలంలో ఒక స్నేహితుడు తోడుంటే చాలని, డబ్బుకన్నా కూడా స్నేహం గొప్పదని చాటే నేపథ్యంతో ఈ సినిమాను రూపొందించామని వాసుదేవనాయుడు తెలిపారు. ఈ సినిమాను తప్పకుండా ప్రేక్షకులు ఆదరిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



# 33కోట్లతో ట్యాంక్‌బండ్

నెల్లూరు దర్గామిట్టలోని స్వర్ణాల చెరువు తీరాన కేంద్రమంత్రి వెంకయ్యానాయుడు చొరవతో మంజూరైన రూ.33కోట్లతో నూతనంగా ట్యాంక్‌బండ్ నిర్మించి బారాషాహిద్ దర్గా ఆవరణాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు నగరంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అన్నమయ్య సర్కిల్, ముత్తుకూరుగేట్, విజయమహల్‌గేట్ ప్రాంతాల్లో డివైడర్లలో గ్రీనరీని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరునెలల్లో నగరాన్ని సుందరవనంగా తీర్చిదిద్దేందుకు డివైడర్లతో పాటు 15కిలోమీటర్ల మేర పచ్చదనం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నెల్లూరు నగరాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు వచ్చే మూడేళ్ళలో వందకోట్ల నిధులను ఖర్చు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. నాయకులు నన్నేసాహెబ్, షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# వారివి మాటలే కాని చేతలు కావు

**- సిపిఎం నాయకుడు బి.వి.రాఘవులు**



కేంద్రమంత్రి వెంకయ్యానాయుడు, సిఎం చంద్రబాబునాయుడులవి ఉత్త మాటలేకాని చేతలు కావని సిపిఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి బి.వి.రాఘవులు ఎద్దేవా చేశారు. ఆర్థిక విధానాలు అమలు, ఉద్యోగ, కార్మికుల, ప్రజలపై ప్రభావం అనే అంశంపై నెల్లూరులో ఆదివారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. నూతన రాజధాని అమరావతి అంటూ గొప్పలు చెప్పడం మానుకోవాలని హితవు పలికారు. మహిళా సాధికారత అంటూ నిర్వహించిన సదస్సులో ప్రసంగిస్తున్న వారివి ఉత్త మాటలేనని పేర్కొన్నారు. చంద్రబాబు పాలన చూస్తుంటే అసలు ప్రజాస్వామ్యం ఉందా అనే ఆందోళన కలుగుతోందన్నారు. ప్రధానమంత్రి మోడీ తీరు చూస్తుంటే నియంత ధోరణిలో పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. పెద్దనోట్లు రద్దు చేసి పేద, మధ్యతరగతి వారి జీవితాలను మంటగలిపారన్నారు. నోట్ల రద్దు వల్ల ఉగ్రవాదులు తగ్గుతారనే వాదన కరెక్టు కాదన్నారు.

# కాళీపట్నంకు ఈదూరు పురస్కారం



శ్రీకాకుళంలో కథానిలయం 20వ వార్షికోత్సవ సభలో శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ పాటూరు లక్ష్మీనృసింహం చేతులమీదుగా సుప్రసిద్ధ కథకుడు, కథానిలయ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కాళీపట్నం రామారావు ఈదూరు సుబ్బయ్య సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నృశింహం మాట్లాడుతూ తాను నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట వాసిగా, నెల్లూరుజిల్లా రచయితల సంఘం(నెరసం) ఆధ్వర్యంలో కాళీపట్నం రామారావుకు అవార్డును అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ఈదూరు సుబ్బయ్య సాహితీపీఠం వ్యవస్థాపకుడు డాక్టర్ ఈదూరు సుధాకర్, చిన్ని నారాయణ రావు, ఈతకోట సుబ్బారావు, మేడా మస్తాన్‌రెడ్డి, ఈదూరు రవి, మధురాంతకం నరేంద్ర, విమల, అర్నాథ్, గౌతునాయుడు తదితరులు పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్‌శాఖపై ప్రై'వేటు'?



ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే రిజిస్ట్రేషన్ శాఖ త్వరలో ప్రైవేటు పరం కానుందని సమాచారం. నెల్లూరుజిల్లాలో నెల్లూరు, గూడూరు కింద మొత్తం 19 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. ఈ కార్యాలయాల్లో ఏప్రిల్ నెలలో ఫ్రంటెండ్, బ్యాకెండ్ విధానాన్ని ప్రవేశ పెట్టబోతున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మొదట ప్రవేశం వద్ద ప్రైవేటు ఏజెన్సీకి చెందిన వ్యక్తులుంటారు. ఎవరైనా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు దస్తావేజులు తీసుకుని వస్తే వాటిని వారు పరిశీలించి అంగీకరించాలి. ఆ తర్వాత సంబంధిత సబ్‌రిజిస్ట్రార్ ఫైల్‌పై సర్టిఫై చేసి ఇస్తారు. ఈ తతంగం అంతా ఏజెన్సీ వ్యక్తులే చూసుకుంటారు. ప్రస్తుతం ఒక్కో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పదిమంది వరకు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో సిబ్బంది పనిచేస్తున్నారు. కొత్త విధానం అమలులోకి వస్తే వారి ఉద్యోగాలకు ఎసరు పెట్టినట్లే!

రిజిస్ట్రేషన్ వ్యవహారాలు ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగిస్తే తామంతా డమ్మీలుగా అయిపోతామని ఉద్యోగులు ఆందోళనకు గురౌతున్నారు. అలాగే ఎన్నో ఏళ్లుగా జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను నమ్ముకుని జీవిస్తున్న దస్తావేజు లేఖరులు ఈ విధానాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు.

# ముగిసిన రెవెన్యూ క్రీడలు





నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మూడురోజులు పాటు జరిగిన నెల్లూరుజిల్లా 8వ రెవెన్యూ క్రీడా సాంస్కృతికోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. పోటీలలో గెలుపొందిన విజేతలకు జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు, జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ బహుమతులు అందజేశారు. అత్యధిక పాయింట్లు సాధించిన కలెక్టరేట్ జట్టు ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. కలెక్టరేట్‌కు చెందిన కంప్యూటర్ ఆపరేటర్ వివేక్ క్రికెట్‌లో ఉత్తమ క్రీడాకారుడిగా అవార్డును అందుకున్నాడు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2015లో ఈ క్రీడలను ప్రారంభించడం జరిగిందన్నారు. రెవెన్యూ శాఖ సిబ్బంది ఎప్పుడు తుఫాన్‌లు, వరదలు, అగ్నిప్రమాదాలు, ఎన్నికలు తదితర పనుల్లో ఎల్లవేళలా అంకితమై ఉంటారని, ఈ క్రీడల్లో తరతమ బేధాలు, స్థాయి బేధాలు లేకుండా అందరూ ఏకమై నిర్వహించడం జరిగిందన్నారు.

రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వరరావు, జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణభారతి, ఏపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా శాఖ గౌరవాధ్యక్షుడు రవీంద్రబాబు, జిల్లా అధ్యక్షుడు నరశింహులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మధుసూదన రావు, జిల్లా కార్యదర్శి పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పక్షవాతం పట్ల జాగ్రత్త

**- నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్**



పక్షవాతం, మూర్ఛ వ్యాధులపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నెల్లూరునగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు రామ్మూర్తి నగర్‌లో ఉన్న డాక్టర్ బిందుమీనన్ ఆసుపత్రిలో డాక్టర్ బిందుమీనన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పక్షవాతంపై నూతనంగా రూపొందించిన యాప్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా వ్యాధిగ్రస్తులకు ఎప్పటికప్పుడు వైద్యసేవలు అందించేందుకు వీలుంటుందన్నారు. ఈ ఫౌండేషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పక్షవాతంపై అవగాహన కల్పించేందుకు ఒక ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. 200మంది రోగులకు ఉచితంగా మందులు అందజేస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు.

డాక్టర్ బిందుమీనన్ మాట్లాడుతూ పక్షవాతం వ్యాధిగ్రస్తులకు ఉచిత సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ఈ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసామన్నారు. అనంతరం వ్యాధిగ్రస్తులకు ఎమ్మెల్యే ఉచితంగా మందులు పంపిణీ చేసారు. ఫౌండేషన్ నిర్వాహకులు నంబియార్, నిజాముద్దీన్ పాల్గొన్నారు.




# రఘుకు రామస్వామి పెరియార్ అవార్డు

ప్రకాశం జిల్లా చీరాలలో సహజసాహితీ(సాహిత్య, సాంస్కృతిక సంస్థ) ఆధ్వర్యంలో ఆదివారం గురజాడ అప్పారావు పురస్కారాలు - 2016 ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంఘీక, సంక్షేమ సేవలందించినందుకుగాను రత్నమ్మ ఛారిటబుల్ సొసైటి సంస్థ గౌరవాధ్యక్షుడు రాచపాళెం రఘుకు ఇ.వి.రామస్వామి పెరియార్ అవార్డును ప్రదానం చేశారు. సహజ సాహితి అధ్యక్షుడు వడలి రాధాకృష్ణ, ప్రకాశం జిల్లా రచయితల సంఘ కార్యదర్శి పొన్నూరి వెంకట శ్రీనివాసులు, నెల్లూరుజిల్లా రచయితల సంఘం ప్రధానకార్యదర్శి పాతూరి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలపై అవగాహన కోసమే...

# పెన్నా 5కే రన్



నెల్లూరుజిల్లా ప్రజలకు క్రీడలపై అవగాహన కలిగించేందుకే పెన్నా 5కే రన్ నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఉత్తర్వుల మేరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరులో ఆదివారం పెన్నా 5కే రన్ పోటీలను నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అండర్-17 స్థాయిలో బాలబాలికలకు ఒక విభాగంలో, మరో విభాగంలో 17సంవత్సరాలు పైబడిన బాలబాలికలు, స్త్రీ పురుషులకు పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అనంతరం ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో పెన్నా 5కె రన్‌లో పాల్గొని గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపి రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడారు. అనంతరం 40సంవత్సరాలు పైబడి విధులు నిర్వహించిన వి.శ్రీనివాసులు, బి.వేణుగోపాల్, బి.భాస్కరరావు, గోవిందస్వామి, శ్యాంసన్, సుబ్రహ్మణ్యం తదితరులను దుశ్శాలువాలతో సత్కరించారు. షటిల్ ఆటలో విజేతలైన వెంకటేశ్వర్లు, నాజర్, పవన్‌కుమార్ తదితరులను జాయింట్ కలెక్టర్ సత్కరించారు. అనంతరం క్యాంప్‌ఫైర్ నిర్వహించారు. నెల్లూరు ఆర్డీఓ కె.వెంకటేశ్వర్లు, గూడూరు ఆర్డీఓ అరుణబాబు, కావలి ఆర్డీవో ఐ.భక్తవత్సలరెడ్డి, నాయుడుపేట ఆర్డీఓ వి.కె.శీనానాయక్, ఆత్మకూరు ఆర్డీఓ యం.వి.రమణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# గీతాంజలి వార్షికోత్సవం



గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ 8వ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 11న విద్యార్థులు, అధ్యాపకుల ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హైదరాబాద్ క్యాడిస్లాయ్ ఇంజనీరింగ్ సంస్థ టెక్నో కమర్షియల్ జనరల్ మేనేజర్ సుకుమార్.డి.రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు అంతర్జాతీయస్థాయిలో శాస్త్ర సాంకేతిక రంగాలలో సంభవిస్తున్న అభివృద్ధి మార్పులకు అనుగుణంగా తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగు పరచుకోవాలని సూచించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న గమేశా రెన్యువబుల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సీనియర్ మేనేజర్ అమీత్‌అశోక్‌సాగర్ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో సృజనాత్మక ఆలోచనా విధానంతో సామాజిక అభివృద్ధికి దోహదం చేసే ప్రాజెక్టులను చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కావలి విశ్వోదయ గ్రూపు విద్యాసంస్థల రెక్టార్ డి.వినయ్‌కుమార్‌రెడ్డి, కళాశాల సెక్రటరి ఎన్.సుధాకర్‌రెడ్డి, కళాశాల సంయుక్త కార్యదర్శి సి.శ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ డా॥ జి.సుబ్బారావు తమ వార్షిక నివేదికలో కళాశాల సాధించిన విజయాలను ప్రగతిని వివరించారు. అనంతరం డాక్టరేట్ పట్టాలను సాధించిన వివిధ విభాగాధిపతులను సత్కరించారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కళాశాల డైరెక్టర్ డివివియస్ ఫణికుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వై.దినకర్, పి.రాఘవరెడ్డి, వి.వెంకయ్య, యన్.శ్రీధర్, టిఎల్‌ఎన్ సుకుమార్, వై.జాహ్నవి, ప్రకాష్, సిబ్బంది అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎల్‌ఎల్‌ఆర్ మేళాకు అనూహ్య స్పందన

ఆటో బ్యాడ్జీల కోసం రవాణాశాఖ నిర్వహించిన ఎల్‌ఎల్‌ఆర్ మేళాకు అనూహ్య స్పందన వచ్చింది. లైసెన్స్ కలిగిన డ్రైవర్లు ఈ బ్యాడ్జీలను పొందాలంటే గతంలో నిబంధనల ప్రకారం కార్యాలయం చుట్టూ తిరిగేవారు. దీంతో రవాణాశాఖ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం ఆదేశాలతో ఉపరవాణా కమిషనర్ శివరామ్‌ప్రసాద్ ఈ ఎల్‌ఎల్‌ఆర్ మేళాకు శ్రీకారం చుట్టారు. లైసెన్స్‌లు కలిగిన రెండువేల మంది ఆటోడ్రైవర్లు శనివారం నెల్లూరులోని రవాణాశాఖ కార్యాలయానికి అన్ని సర్టిఫికెట్లతో చేరుకున్నారు. గతంలో 8వ తరగతి పాస్ అయివుంటేనే బ్యాడ్జీలు ఇచ్చేవారు. ప్రస్తుతం వెసలుబాటు కల్పించి తెల్ల కాగితంపై అఫిడవిట్ సంబంధిత డ్రైవర్ సంతకం తీసుకున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ఆటోడ్రైవర్లంతా సిద్ధపడడంతో సిబ్బందికి వీరిని అదుపు చేయడం కష్టమైంది. శనివారం ఒక్కరోజే 1100 మందికి బ్యాడ్జీలను అందజేశారు. ఈ మేళాలో డిటిసితో పాటు ఇన్‌ఛార్జ్ ఆర్టీవో కిషోర్, ఎంవిఐలు సీతారామిరెడ్డి, జాకీర్, సునీల్, ఏఎంవిఐలు, ఏవోలు పాల్గొన్నారు.

## వైజేపీ లయన్స్ సహకారంతో..

# శిశుమందిరంలో కంప్యూటర్ ల్యాబ్



మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ దేవసేన, డాక్టర్ సిఆర్‌రెడ్డి తదితరులు

గూడూరు పట్టణంలోని సరస్వతి శిశు మందిరం పాఠశాలలో వైజేపీ లయన్స్‌క్లబ్ సహకారంతో గౌరవాధ్యక్షులు డాక్టర్ సి.ఆర్.రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, సైన్సు ల్యాబ్, సమావేశమందిరాన్ని ఇటీవల మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థానాలకు చేరాలని తెలిపారు. విద్యార్థి దశ నుంచి అంకితభావం, కృషి, పట్టుదలతో ఎదగాలని చెప్పారు. ఆధునిక పరిజ్ఞానానికి అనుగుణంగా పాఠశాలలో సౌకర్యాలు కలుగచేయడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. భజనలు, కోలాటం, కూచిపూడి, భరతనాట్యం తదితర కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సరస్వతి శిశుమందిరం గౌరవాధ్యక్షులు డాక్టర్ సిఆర్ రెడ్డి, డాక్టర్ సి.మోహన్‌రెడ్డి, డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ సి.రోహిణి, లయన్స్‌క్లబ్ వైజేపీ అధ్యక్షుడు వరిదిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, లయన్స్ ప్రాంతీయ అధ్యక్షుడు గౌతమ్, కార్యదర్శి నాగహరికృష్ణ, డిఎస్పీ శ్రీనివాస్ సతీమణి ఇందిర, శ్రీలక్ష్మి, కె.మునిగిరీష్, మురళీరెడ్డి, వెంకటరత్నం, ప్రసాదురెడ్డి, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

**- తహశీల్దార్ వెంకటేశ్వర్లు**



ప్రజాసమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని గూడూరు తహశీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. గూడూరు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆర్ఐలు, విఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతి ఒక్కరు అంకితభావంతో వృత్తిని నిర్వర్తించాలని తహశీల్దార్ తెలిపారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. ఇకపై అర్జీలు ఏ రోజుకు ఆరోజే పరిష్కరించేలా చూడాలని స్పష్టం చేశారు. గూడూరు మండలంలో వున్న వివిధ సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్, ఆర్ఐలు, విఆర్వోలు పాల్గొన్నారు.

## విఎస్ఆర్ పాఠశాల

# వార్షికోత్సవం

గూడూరు పట్టణం రాపూరు రోడ్డులోని విఎస్ఆర్ పాఠశాలలో ఈ నెల 11వ తేదీ రాత్రి పాఠశాల వార్షికోత్సవాన్ని నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని, విద్యార్థులు సాంస్కృతిక, జానపద, సినీ నృత్య కార్యక్రమాలను ఉత్సాహ భరితంగా పోటీపడుతూ ప్రదర్శనలను ఇచ్చారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం ప్రతినిధులు అన్నపూర్ణ, బాలకృష్ణంరాజు, సంజీవరాజు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# సుగంధినికి రోటరీ సన్మానం



గూడూరు గానకోకిల కుమారి ఎ.సుగంధిని తన స్వరంతో సుస్థిర స్థానం పొందాలని పలువురు కోరారు. గూడూరు పట్టణంలోని రోటరీ వెస్ట్‌క్లబ్ అధ్యక్షులు శేగు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఓ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఈ టీవీ పాడుతాతీయగా పోటీలలో సెమీఫైనల్స్‌కు చేరుకున్న గాయని సుగంధినిని ఘనంగా సన్మానించారు. వర్ధమాన గాయనికి పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం, సభ్యులు గోపాల్‌రెడ్డి, కె.సుందరామిరెడ్డి, కె.మునిగిరీష్, శ్రీకంటి రామ్మోహన్‌రావు, నాశిన నాగులు, దశరథరామిరెడ్డి, పి.ఎం.రావు, శ్రీలక్ష్మి, ఎన్.ఎస్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు ఫలసరుకులు


వృద్ధులకు ఫలసరుకులు అందజేస్తున్న డాక్టర్ సి.రోహిణి తదితరులు

నిరుపేద వృద్ధులను ఆదుకోవడం సంతోషంగా ఉందని వైద్యురాలు డాక్టర్ సి.రోహిణి తెలిపారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి రోటరీ భవనం రోటరీ క్లబ్ గూడూరు వారు రోటరీ హెల్పేజ్ పథకం ద్వారా ఇటీవల ఫలసరకులను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ సి.ఆర్.రెడ్డి, అనసూయమ్మ తదితరుల దాతృత్వంతో 60మంది వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. 12ఏళ్లుగా నిర్విరామంగా వృద్ధులకు నిత్యావసర వస్తువులును అందించడం ఆనందంగా ఉందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు, మునిరాజా, హరిప్రసాద్, జానకిరామిరెడ్డి, దశరథరామిరెడ్డి, హనుమంతరావు, కె.మునిగిరీష్, నాగేంద్రప్రసాద్, దయాకర్‌రెడ్డి, మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

పనులు నిదానంగా జరుగుతాయి. అవసరాలకు ఋణం చేయవలసి రావచ్చును. బంధుమిత్రుల సహాయ సహకారాలు బాగుంటాయి. అధికారుల సహకారం ఉద్యోగులకుంటుంది. బిడ్డల వల్ల సమస్యలుండవచ్చును. ఆదాయం తృప్తికరంగా ఉండదు. ఖర్చులు పెరిగిపోతాయి. అదుపు ఉండదు. కుటుంబంలోనే చిన్నచిన్న మనస్పర్ధలు, వస్తు నష్టం ఉంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

దూరప్రయాణాలుంటాయి. అదనపు ఖర్చులు తప్పనిసరిగా ఉంటాయి. ఉద్యోగులకు పని ఒత్తిడి, అధికారులతో ఇబ్బందులుంటాయి. విద్యావృద్ధికి గట్టి కృషి జరుగుతుంది. ఆరోగ్యం ఫరవాలేదు. రాజకీయ సంబంధమైన నిర్ణయాల వల్ల మీరు ఆందోళన చెందుతారు. విలువైన వస్తువులు, గృహోపకరణాలు సమకూర్చుకొంటారు. శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

కొత్త పెట్టుబడులు, వ్యాపార విస్తరణ ప్రయత్నాలు జరుగుతాయి. విద్యాప్రగతి, శరీరారోగ్యం బాగుంటుంది. అనుకోని ప్రయాణాలుంటాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. శుభకార్యాలలో పాల్గొంటారు. కాంట్రాక్టర్లకు మార్కెటింగ్ చేసే వారికి, ఇతర ఉద్యోగులకు పనివత్తిడి ఎక్కువుంటుంది. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. శుభకార్యాలు నిర్ణయం కాగలవు.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 17.2.2017 నుండి
తేది. 23.2.2017 వరకు

ఈ వారం సింహంలో రాహువు, కన్యలో గురువు, ధనుస్సులో శని, కుంభంలో రవిబుధ కేతువులు, మీనంలో కుజశుక్రులు, తుల వృశ్చిక ధనుస్సు రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

**ముహూర్తములు**

తేది 17 శుక్రవారము ఉదయం గంట 9.15 నుండి గంట 10.30లోగా స్వాతీయుక్త మేష లగ్నమున వివాహ గృహారంభ అన్నప్రాశనలు.

### మాఘ మాస కృష్ణపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 17 | శుక్ర | షష్ఠి | ఉ॥ గం.9.09వ॥ |
| తేది. 18 | శని | సప్తమి | ప॥ గం.11.07వ॥ |
| తేది. 19 | ఆది | అష్టమి | ప॥ గం.1.28వ॥ |
| తేది. 20 | సోమ | నవమి | సా॥ గం.3.23వ॥ |
| తేది. 21 | మంగళ | దశమి | సా॥ గం.5.20వ॥ |
| తేది. 22 | బుధ | ఏకాదశి | రా॥ గం.7.00వ॥ |
| తేది. 23 | గురు | ద్వాదశి | రా॥ గం.8.11వ॥ |

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

అధికారుల సహకారం ఉద్యోగులకు బాగుంటుంది. మొగమాటాలకు, ప్రలోభాలకు లొంగవద్దు. శుభాకార్యాలలో పాల్గొంటారు. కొత్త వస్తువులు గృహోపకరణాలు సమకూరుతాయి. స్థిరాస్తుల క్రయవిక్రయాలు జరుగవచ్చును. విద్యాప్రగతి బాగుంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు. ఆర్ధిక లావాదేవీలను సమర్ధవంతంగా నిర్వహిస్తారు. ఆత్మీయంగా మెలిగేవారి వల్ల కొద్ది సమస్యలుండగలవు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

శుభకార్యాలలో పాల్గొనడం, శుభకార్య ప్రయత్నాలు ఫలించడం, దూరప్రయాణాలుంటాయి. మంచి సమాచారం లభించి మనస్సు కుదుటపడుతుంది. ఆరోగ్యం ఫరవాలేదు. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. బిడ్డలకు మేలు జరుగుతుంది. రావలసిన బాకీలు కొంత అందుతాయి. విద్యాప్రగతి బాగుంటుంది. కుటుంబ సౌఖ్యం కలదు.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ప్రభుత్వ అనుమతులలో జాప్యం కలదు. కొత్త పెట్టుబడులు, వ్యాపారవృద్ధి కృషి ఫలిస్తుంది. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. శుభకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. ఉద్యోగులకు పనిభారంతో పాటు అధికారుల తోడ్పాటు బాగుంటుంది. ఇంట బయట వ్యవహారాలలో సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతారు. రావలసిన బాకీలు కొంత లభిస్తాయి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

అనుకోని ప్రయాణాలు, రావలసిన బాకీలు కొంత లభించడం జరుగుతుంది. ఉద్యోగులకు అధికారుల సహకారం ఉంటుంది. వారం మధ్యలో కొద్ది అనారోగ్య బాధలుంటాయి. ఉద్యోగులకు స్థానమార్పు, ఉద్యోగార్ధులకు అవకాశాలుంటాయి. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. బయట వ్యవహారాలైనా, ఆర్థిక వ్యవహారాలైనా చక్కని ప్రణాళికలతో ముందుకు సాగుతారు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

బంధుమిత్రుల రాకపోకలు ఇబ్బందిని కలిగించగలవు. అనవసర విషయాలలో తల దూర్చవద్దు. ఉద్యోగులకు పనుల వత్తిడి, విశ్రాంతి లేకుండుట ఉంటుంది. కుటుంబంలో చిన్నపాటి విభేదాలుంటాయి. ఆడిటర్లు న్యాయవాదులకు అవకాశాలు బాగుంటాయి. విద్యాప్రగతి బాగుంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా జరుగుతాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

శుభకార్యప్రయత్నాలు ఫలించగలవు. ఇతరుల నుండి నిందలు విమర్శలు ఎదుర్కొనవలసి ఉంటుంది. శుభకార్యాలలో పాల్గొంటారు. నిరుద్యోగులకు అనుకూలత బాగుంది. విద్యార్థులు మరింత శ్రమించండి. కొత్త పెట్టుబడి అవకాశాలు, భాగస్వామ్య అవకాశాలు లభించకపోవచ్చును. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. కోర్టు కేసులు వాయిదాపడతాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

అనుకున్న పనులు సరిగా జరగవు. టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. ఉద్యోగులపై అధికారుల పెత్తనం, పని వత్తిడి బాగుంటుంది. ప్రభుత్వ అనుమతులు, రావలసిన బాకీలు నిలబడిపోతాయి. వస్తు వాహన గృహ రిపేర్లుంటాయి. వాహనాలు జాగ్రత్తగా నడపండి. విద్యావృద్ధికై గట్టి కృషి చేస్తారు. ఖర్చులు ఎక్కువగా ఉండి ఆర్థిక ఇబ్బందులుంటాయి.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. సామాజిక కార్యాలలో పాల్గొంటారు. వస్తు వాహన గృహ రిపేర్ల ఖర్చులుంటాయి. ప్రముఖుల పరిచయాలుంటాయి. ఉద్యోగులు జాగ్రత్తగా విధి నిర్వహణ జరుపుట మంచిది. ఖర్చులు అధికమై అదుపు ఉండదు. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. బంధువర్గం, సోదర వర్గం నుండి ఆర్థికమైన, వ్యవహారికమైన ఇబ్బందులుంటాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఉద్యోగులకు అధికారుల అనుకూలత బాగుంటుంది. దైవ సేవా కార్యాలలో పాల్గొంటారు. విద్యాప్రగతి బాగుంటుంది. బ్యాంకు ఋణాలు, ప్రభుత్వ అనుమతులలో ఆలస్యం ఉంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు. ఆర్థికంగా బాగుంటుంది. రావలసిన బాకీలు లభించగలవు. వృత్తి వ్యాపార వ్యవసాయాలు వేగవంతమై ఆదాయం పెరుగుతుంది.

# రోజా అటాక్‌తో బాబు బెంబేలు

శ్రీను గల్పిక

అది ప్రపంచంలోని మేటి నగరాలైన న్యూయార్క్, బీజింగ్, సింగపూర్, మిలాన్, ఇస్తాంబుల్, మాస్కో, వాషింగ్టన్, సియోల్‌లను మిక్సీలో వేసి గ్రైండ్ చేసి బయటకు తీస్తే వచ్చినట్లుండే అమరావతి రాజధాని నగరం. అక్కడంతా కోలాహలంగా వుంది. కారణం మహిళా పార్లమెంటేరియన్ సదస్సు జరుగుతుండడమే! వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళా ప్రజాప్రతినిధులు, వివిధ రంగాలలో అగ్రగణ్యులైన మహిళలు పెద్దఎత్తున అక్కడకు చేరుకుంటున్నారు. ఇక బస్సుల్లో, లారీల్లో డ్వాక్రా సంఘాల మహిళలను పెద్దఎత్తునే అక్కడకు తరలించారు. హైటెక్ రత్న, సీఎం చంద్రబాబు నాయకత్వంలో స్పీకర్ కోడెల శివప్రసాద్, మంత్రులు నారాయణ, పత్తిపాటి పుల్లారావు, దేవినేని ఉమామహేశ్వరరావు, గంటా శ్రీనివాసరావు, చింతకాయల అయ్యన్నపాత్రుడు, బొజ్జల గోపాలకృష్ణారెడ్డిలు ఏర్పాట్లు చేస్తున్నారు. చంద్రబాబునాయుడు దీపాన్ని వెలిగించి జ్యోతిని ప్రారంభించాడు. ప్రారంభోత్సవ సందర్భంలో వేదిక మీద ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్‌పై కొన్ని సాంస్కృతిక కార్యక్రమాలు డిస్‌ప్లే చేయసాగారు. మొదట 'గుండమ్మ కథ' సినిమాలో 'ఎన్టీఆర్ పాట... లేచింది నిద్ర లేచింది మహిళా లోకం... దద్దరిల్లింది పురుషప్రపంచం' అనే పాట వచ్చింది. ఆ పాటకు మహిళలంతా పెద్దఎత్తున చప్పట్లుకొట్టారు. ఆ తర్వాత 'మేడమ్' సినిమాలో రాజేంద్రప్రసాద్ మహిళగా నటిస్తూ పాడిన "ఓ మహిళా మేలుకో... నీ శక్తిని తెలుసుకో... రా... ముందుకు" అనే పాటను ప్రదర్శించారు.

తర్వాత పత్తిపాటి పుల్లారావు వేదిక మీదకొచ్చి... తెలుగుదేశం ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తుంది. మహిళలంటే మాకు గౌరవం. తెలుగింటి ఆడపడుచుల ఆత్మగౌరవాన్ని కాపాడటానికి పుట్టిన పార్టీ ఇది. మా హయాంలో మహిళల ఉద్ధరణ కోసం ఏమేం చేసామన్నది కొన్ని వీడియోల ద్వారా ప్రదర్శించబడుతుంది... చూసి చప్పట్లు కొట్టండి అంటూ స్టేజీ మీద నుండి దిగిపోయాడు. అక్కడే వున్న డిజిటల్ స్క్రీన్‌పై కొన్ని దృశ్యాలు ప్రసారం కాసాగాయి.

మొదటి సీన్... గేదె చావిట్లో ఉండాలి... బండి షెడ్‌లో ఉండాలి... ఆడది వంటింట్లో ఉండాలి... అలా ఉంటేనే బండికైనా ఆడమనిషైనా సేఫ్. అలా కాకుండా రోడ్లమీద తిరుగుతామంటే యాక్సిడెంట్లు తప్పవు అని స్పీకర్ కోడెల శివప్రసాద్‌రావు ప్రెస్‌మీట్‌లో చెప్పడాన్ని ప్రదర్శించారు. ఈ సీన్ చూసి తెలుగుదేశం నాయకులంతా చప్పట్లతో మోతెక్కించారు.

రెండో సీన్... విలేకరుల సమావేశంలో సీఎం చంద్రబాబు... కోడలు మగబిడ్డను కంటానంటే అత్త వద్దంటుందా... అంటూ వ్యాఖ్యానించే సన్నివేశం... ఇది చూసాక మా చంద్రబాబు భలే సామెత చెప్పారంటూ తెలుగు తమ్ముళ్ళు ఈసారి ఈలలు వేసారు.


మూడోసీన్... దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఎమ్మార్వో వనజాక్షిని జుట్టుపట్టుకుని ఇసుకరీచ్‌లో ఈడ్చుకుపోవడాన్ని చూపించారు. ఈ సన్నివేశాన్ని ఎంతో ఉత్కంఠభరితంగా చూసారు.

నాలుగో సన్నివేశం... అనంతపురం జిల్లా మడకశిర మండలంలో ఓ మహిళను తెలుగుదేశం సర్పంచ్ కాలితో తన్నుతున్న సన్నివేశాన్ని ప్రదర్శించారు.

ఐదో సన్నివేశం... తెలుగు యువరాజు నారా లోకేష్‌బాబు ఫారిన్ అమ్మాయిలతో కలిసి ఈత కొడుతున్న దృశ్యాలు...

ఈ సన్నివేశాలను ప్రదర్శించే క్షణం ముందే చంద్రబాబు వేదిక వద్ద నుండి అర్జంట్ ఫోన్ కాల్ వస్తే బయటకు వెళ్లాడు. ఆయన ఫోన్ మాట్లాడి వేదిక వద్దకు వచ్చేసరికి స్క్రీన్ మీద లోకేష్ సీన్‌లు కనిపిస్తున్నాయి. వాటిని చూసి చంద్రబాబు బిత్తరపోయాడు. అప్పటికే ఆ సదస్సుకు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన మహిళలందరూ ఆ సన్నివేశాలు చూసి ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ఒక్కొక్కరు ఒక్కో ఆదిపరాశక్తిలా వున్నారు. చంద్రబాబు అక్కడే వున్న పత్తిపాటి పుల్లారావుతో... ఇప్పటిదాకా ఏం ప్రదర్శించారని అడిగాడు. అప్పటిదాకా ప్రదర్శించిన సన్నివేశాలను పత్తిపాటి వివరించారు. నా కొంప ముంచారు... మొదటి సన్నివేశం వచ్చినప్పుడే ఆపేసి ఉండాల్సింది కదా. నెగటివ్ రోల్స్ వస్తుంటే ఎందుకు కట్ చేయకుండా ప్రదర్శించారు అని ప్రశ్నించాడు. దానికి పత్తిపాటి... ఏమో సార్, నేను మీరిచ్చిన సి.డినే సి.డి ప్లేయర్‌లో పెట్టి డిస్‌ప్లే చేసాను. ఆ సన్నివేశాలను చూసి మహిళా సాధికారత అంటే అదేనేమోననుకున్నాను అని చెప్పాడు. చంద్రబాబుకు అరికాల్లో మండి... మీ తెలివి తెల్లారినట్లే వుంది. అసలు సి.డి ఎందుకు మారింది. నేను రూపొందించిన సి.డిలో మన ప్రభుత్వం మహిళా సంక్షేమానికి చేపట్టిన పథకాలు, మహిళల ఆత్మగౌరవం కార్యక్రమాలు, మనవల్లనే ఒలింపిక్స్‌లో పి.వి.సింధూ పతకం సాధించిందన్న ఉపోద్ఘాతం వంటివి వున్నాయి. అవి ప్రదర్శించకుండా ఈ చెత్తంతా ప్రదర్శించారు. ఇంత చేసి కూడా మనల్ని మనం మహిళల పాలిట విలన్‌లుగా చూపించుకున్నాం. ఈ పొరపాటు ఎక్కడ జరిగింది, సి.డి ఎక్కడ మారింది అని చంద్రబాబు గట్టిగా ప్రశ్నించాడు... అప్పుడే ఆయన సెల్‌ఫోన్ మోగింది. అన్‌నోన్ నెంబర్ నుండి కాల్... చంద్రబాబు ఫోన్ ఎత్తాడు. అవతల నుండి బిగ్గరగా నవ్వు... అది ఓ మహిళ గొంతు. ఏం చంద్రబాబు నాయుడు గారు, దూల తీరిందా, తిక్క కుదిరిందా... అని లేడీ విలన్‌లాగా నవ్వుతూ అడిగింది. ఎవర్నువ్వు అని చంద్రబాబు అడిగాడు. నీ గుండెల మీద చేయి వేసుకో... నీ గుండె ఏ సౌండ్‌తో కొట్టుకుంటుందో చూడు... ఆ సౌండ్ పేరే నేను అని ఆ కంఠం చెప్పింది. చంద్రబాబు గుండెల మీద చేయి వేసుకున్నాడు... గుండె శబ్దం 'లబ్ డబ్' అని రావడం లేదు. 'రోజా రోజా' అని రాసాగింది. చంద్రబాబుకు అర్ధమైంది. నువ్వు రోజావా అని అడిగాడు. యస్... నేనే, నీ పాలిట ఆడసింహస్వప్నాన్ని. నువ్వు తయారు చేసుకున్న సి.డిని మార్పించింది నేనే, అంతేకాదు, నేరుగా అమరావతికే వస్తున్నా... అక్కడే మీ బండారం బయట పెడతా... ఉంటా అని ఫోన్ పెట్టేసింది. ఆ షాక్ నుండి తేరుకోవడానికి చంద్రబాబుకు గంట పట్టింది. కోలుకున్నాక ఆయన వెంటనే కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు ఫోన్ చేసి... సార్, వెంటనే పది ప్లాటూన్ల కేంద్రబలగాలను గన్నవరం పంపించండి, అలాగే ఎన్ఎస్‌జి కమాండోలు, ఇండో టిబెటియన్ బెటాలియన్‌ను, పిఆర్ఎఫ్ ఫోర్స్‌ను పంపించండని కోరాడు. అందుకు రాజ్‌నాథ్‌సింగ్... ఏం చంద్రబాబు గారు... గన్నవరం ఎయిర్‌పోర్టుపై ఉగ్రదాడి ఉంటుందని నిఘావర్గాలు హెచ్చరించాయా అని అడిగాడు. దానికి చంద్రబాబు... అట్లాంటిది వుంటే మేం చూసుకోగలం సార్, కాని మా మీద 'రోజా' అటాక్ చేయబోతోంది... అందుకే ఇంత సెక్యూరిటీ కోరుతున్నామంటూ ఫోన్ పెట్టేసాడు.

# కళ్యాణ వైభోగం...!



ప్రముఖ ఆడిటర్ కొణిజేటి శ్రీనివాసులు - దేవిసరోజల కుమారుడు **వెంకట అశోకవర్ధన్ - మనిమాల బిదిషా** (పశ్చిమగోదావరి జిల్లా తణుకు వాస్తవ్యులు మాజేటి వెంకటసూర్యనాగేశ్వరప్రకాశ్ - జయలక్ష్మిల కుమార్తె)ల పెళ్లి ఈ నెల 1వ తేదీ తణుకులోని ఎన్ఐసిసి కళ్యాణ మండపం నందు జరిగింది.
నూతన దంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.

# కావలికి మీ చేయూత కావాలి

## - కేంద్రమంత్రులను కోరిన బిఎంఆర్



కావలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ మరియు నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని నిర్మాణ సలహా కమిటి సభ్యులు బీద మస్తాన్‌రావు ఇటీవల న్యూఢిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖా మంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడు, శాస్త్ర సాంకేతిక శాఖామంత్రి సుజనాచౌదరిని కలిసి కావలి నియోజకవర్గ సమస్యలపై వినతి పత్రాలు అందజేసి, అభివృద్ధికి సహకరించవలసిందిగా కోరారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వెంకయ్యనాయుడుని కలిసి కావలిలో ఇబ్బందిగా వున్న స్ట్రామ్ వాటర్ డ్రైన్‌ను ఆధునీకరించి, అడవి నుండి వచ్చే వరద ముప్పు నుండి కావలి ప్రజలను తప్పించాలని కోరారు. డిఆర్ ఛానెల్, డిఎం ఛానెల్ అభివృద్ధికి ప్రత్యేకచర్యలు తీసుకోవాలని కోరారు. తీరప్రాంత మత్స్యకార గ్రామాల్లో గృహనిర్మాణానికి అదనంగా ప్రతి గృహానికి రూ.37,500లు మంజూరుచేయాలని, తుఫాను, వరదల తాకిడికి తట్టుకునే విధంగా గృహనిర్మాణాలను చేపట్టి వారిని ఆదుకోవాలని కోరారు.

శాస్త్ర సాంకేతిక శాఖామాత్యులు సుజనాచౌదరిని కలిసి కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతిపాదించిన రోలింగ్ స్టాక్ కాంపోనెంట్ రీ హ్యాబిటేషన్ వర్క్‌షాపును బిట్రగుంటలో ఏర్పాటు చేసి, ఆస్తులను ఉపయోగించుకునేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. బిట్రగుంటలో వున్న రైల్వే ఆస్తులను పరిరక్షిస్తూ, కొత్త పథకాలను ప్రవేశపెట్టాలని కోరారు. వీరి అభ్యర్థనకు స్పందిస్తూ, సానుకూలమైన నిర్ణయాలు త్వరలో తీసుకుంటామని కేంద్రమంత్రులు హామీ ఇచ్చారు.

# వెంకటేశ్వరస్వామికి బంగారు కిరీటం



నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవీ సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థాన ప్రాంగణంలో కొలువైన శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి బుధవారం అమెరికాలో నివసిస్తున్న నెల్లూరీయుడు దేవతి దిలీప్ బంగారు కిరీటాన్ని బహుకరించారు. స్వామివారికి స్వర్ణకిరీటధారణ సందర్భంగా పంచామృతాభిషేకాలను నిర్వహించారు. నెల్లూరుకు చెందిన దేవతి వెంకట సుబ్రహ్మణ్యం, లక్ష్మి దంపతుల కుమారుడు దేవతి దిలీప్ స్వామివారికి 413.5గ్రాముల స్వర్ణంతో తయారుచేసిన రూ.14లక్షలు విలువజేసే కిరీటాన్ని ఆలయ ఛైర్మెన్ మంచికంటి సుధాకర్‌రావు, ఇ.ఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డికి అందజేశారు.

# రిమాండ్‌కు కుక్కర్ బాంబు నిందితులు



నెల్లూరుజిల్లా కోర్టు ఆవరణంలో బాంబుపేలుడు ఘటనకు పాల్పడిన అయిదుమంది అల్‌ఖైదా ఉగ్రవాదులను పోలీసులు బుధవారం నెల్లూరు అయిదవ అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. విచారణ అనంతరం న్యాయమూర్తి వారికి 14రోజులు రిమాండ్ విధించారు. దీంతో నిందితులను నెల్లూరు జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు. గత ఏడాది సెప్టెంబర్ 12వ తేదీన నెల్లూరుజిల్లా కోర్టు ఆవరణంలోని మూడవ అదనపు జ్యుడిషియల్ జడ్జి కోర్టు ఎదురుగా గల గోడ వద్ద గుర్తు తెలియని దుండగులు అర లీటర్ సామర్థ్యం వున్న ప్రెజర్‌కుక్కర్‌ను టిఫిన్ బ్యాగ్‌లో అమర్చి 9వోల్ట్స్ బ్యాటరీలను వినియోగించి పేలుడుకు పాల్పడ్డారు. ఇదే విధంగా గతంలో చిత్తూరు, కేరళలోని కొల్లాం, యలప్పురం, కర్ణాటకలోని మైసూరు కోర్టుల్లో పేలుళ్ళు జరగడంతో ఇది ఉగ్రవాద చర్యగా కేంద్ర ఇంటెలిజన్స్ బృందం, ఎన్ఐఏ అధికారులు నిర్ధారించారు. నిందితులు అయిదు మందిని ఎవరూ గుర్తుపట్టకుండా ఉండేందుకు ముఖాలకు మాస్కులు వేసి అయిదవ అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. మేజిస్ట్రేట్ తన ఛాంబర్‌లో బాంబు పేలుడు ఘటనపై ఆ నిందితులను విచారించి 14రోజులు రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు ప్రత్యేక వాహనంలో వారిని జిల్లా కేంద్ర కారాగానికి తరలించారు. నెల్లూరు బాంబుపేలుడు ఘటనలో దావూద్ సులేమాన్, అబ్బాస్ అలీలు సూత్రధారులుగా పోలీసులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. నిందితులను మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచేందుకు తీసుకువెళుతున్న సమయంలో వారిని చూసేందుకు న్యాయవాదులు, ప్రజలు ఆత్రుత కనపరిచారు. నిందితులందరూ 25ఏళ్ళలోపు వయస్సున్న యువకులే. అబ్బాస్ అలీ పెయింటర్‌గా పనిచేస్తూ గత ఏడాది నేలపేటలో మత గ్రంథాలతో కూడిన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసినట్లు సమాచారం. కరీం కాట్రాపాలయంలో ప్రింటింగ్ ప్రెస్, దావూద్ సులేమాన్ చెన్నైలోని ప్రముఖ ఐటి సంస్థలో సిస్టం అనలిస్ట్‌గా పని చేస్తున్నట్లు తెలిసింది. నిందితులు అల్‌ఖైదా బేస్‌మూవ్‌మెంట్ పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా యువతను తమవైపు ఆకర్షితులను చేస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ప్రధానసూత్రధారి హకీం అప్పట్లో తప్పించుకున్నాడు.

# స్థానిక ఎమ్మెల్సీ నోటిఫికేషన్



స్థానిక సంస్థల నుండి శాసనమండలి సభ్యుల ఎన్నికకు సంబందించి నోటిఫికేషన్ విడుదల అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మరియు సంయుక్త కలెక్టర్ ఎఎండి ఇంతియాజ్ అహ్మద్ తెలిపారు. బుధవారం సాయంత్రం నెల్లూరు కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో ఎన్నికల నిర్వహణకై సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికకు సంబంధించి నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 21న విడుదల చేయడం జరుగుతుందని, నామినేషన్ ప్రక్రియకు సంబంధించి చివరి తేది ఫిబ్రవరి 28, నామినేషన్ పరిశీలన మార్చి 1, నామినేషన్ ఉపసంహరణ చివరి తేది మార్చి 3, అదే విధంగా ఎన్నికల తేది మార్చి 17, పోలింగ్ సమయం ఉ. 8.00 గంటల నుండి సా. 4.00 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఎన్నికల లెక్కింపు మార్చి 20 అని, ఎన్నికల ప్రక్రియ మార్చి 24తో ముగుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది రత్నశేఖర్, సాయిచంద్, తనూజ, రామ్‌మోహన్, సుధీర్, జిల్లా ఆడిట్ అధికారి తదితరులు పాల్గొన్నారు.




రి.నెం. 50/2017

# శ్రీ సాయిబాబా మందిరం

కావేరి నగర్, పొదలకూరురోడ్డు, కొత్తూరు, నెల్లూరు.

అభినందనలు

నెల్లూరు, పొదలకూరురోడ్డు, కొత్తూరు నందుగల శ్రీ షిరిడి సాయిబాబా మందిరమునకు
రిజిష్టర్డ్ బాడీ నూతన కమిటి ఏర్పడిన సంతోష సమయంలో

ట్రస్టు బోర్డు ఛైర్మెన్
కావేరి బాలచంద్రారెడ్డి గారికి



కార్యదర్శి
బి.మల్లిబాబు గారికి

కోశాధికారి
జాలేశ్వరరావు గారికి
రిటైర్డ్ ఇ.ఇ. ఆర్ & బి

: కార్యవర్గ సభ్యులు :

ఎ.సుబ్బారావు గారికి
యం.శకుంతల గారికి
రిటైర్డ్ సబ్‌రిజిస్టార్, కో-ఆపరేటివ్
ఎ.హైమావతి గారికి
యం.ప్రభాకర్‌రెడ్డి గారికి
అడ్వకేటు
చంద్రశేఖర్ గారికి
కె.సంపూర్ణలక్ష్మి గారికి

మా హృదయపూర్వక అభినందనలు.

- కావేరి నగర్ నివాసితులు


# 19న 'పెరసం' వార్షికోత్సవం

నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం (పెరసం) 7వ వార్షికోత్సవం ఈ నెల 19వ తేది ఉదయం 9.30 గంటలకు డాక్టర్ విజయకుమార్ మెమోరియల్ హాల్‌లో జరుగుతుందని పెరసం అధ్యక్ష కార్యదర్శులు అవ్వారు శ్రీధరబాబు, గుండాల నరేంద్రబాబు, కోశాధికారి తోట సులోచన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి కవితల పోటీలో విజేతలకు బహుమతి ప్రదానంతో పాటు, కవిసమ్మేళనం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా, ప్రతిష్టాత్మక పెన్నా సాహిత్య పురస్కారాన్ని కర్నూలుకు చెందిన ప్రముఖ కవి, 'మళ్ళీ సూర్యోదయం' ఉత్తమ కథాసంపుటి రచయిత శ్రీ రంగనాథ రామచంద్రరావుకు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా జాయింట్ కలెక్టర్ మహమ్మద్ ఇంతియాజ్, విఎస్‌యు వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వి. వీరయ్య, ఆత్మీయ అతిథులుగా ప్రముఖ రచయిత్రి పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి, తెలుగుతేజం మాసపత్రిక ప్రధాన సంపాదకుడు బొగ్గవరపు మాల్యాద్రి పాల్గొంటారని, సాహిత్యాభిమానులు, సాహితీవేత్తలు అందరూ విచ్చేసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# ముగిసిన తమిళ'నాటకం'

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ ఏర్పాటుకు అన్నాడిఎంకె శాసనసభాపక్ష నేతగా ఎన్నికైన పళని స్వామిని ఆహ్వానించడం, ఆరోజే ప్రమాణ స్వీకారం చేయించడం జరిగిపోయాయి. ఇక 15రోజుల్లో ఆయన బల నిరూపణ చేసుకోవడమే మిగిలివుంది. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో పన్నీర్ సెల్వం వైపు వెళ్లిన ఎమ్మెల్యేలు కూడా తిరిగి అన్నాడిఎంకె పక్కకే చేరే అవకాశాలుండడంతో ఆయన మెజార్టీ పరంగా గట్టెక్కడం పెద్ద సమస్య కాదు. కాకపోతే శశికళపై తిరుగుబాటు జెండా ఎగురవేసి డిఎంకె మద్దతుతో సీఎం పీఠ మెక్కాలనుకున్న పన్నీర్‌సెల్వంకి చివరికి కన్నీరే మిగిలింది. ఇప్పుడు ఆయన రాజకీయ భవిష్యత్‌పై నీలి నీడలు కమ్ముకున్నాయి.

తమిళనాట కొనసాగుతున్న రాజకీయ సన్నివేశాలు ఒక్కోదానికి తెరపడుతూ వస్తోంది. గత ఐదు నెలలుగా తమిళ రాజకీయ నాటకాలు మంచి సస్పెన్స్ మధ్య కొనసాగుతుండడం చూస్తున్నాం. ప్రతి అంశంలోనూ టెన్షన్! ఆ రాష్ట్ర ప్రజలే కాదు దేశ ప్రజలు, జాతీయ, అంతర్జాతీయ మీడియా అంతా కూడా అయిదారు నెలలుగా తమిళనాడు పరిణామాలనే ఆసక్తిగా పరిశీలిస్తోంది.

తమిళనాట జరుగుతున్న సరికొత్త నాటకంలో అన్ని ముఖ్యమైన ఘట్టాలు ముగిసాయి. తీవ్ర అనారోగ్యంతో అపోలో ఆసుపత్రిలో చేరిన జయలలిత ఆరోగ్యంపై దాదాపు రెండున్నర నెలలపాటు ఉత్కంఠ కొనసాగింది. ఆమె ఆరోగ్యవంతురాలిగా బయటకు రావాలని అభిమానులు చేసిన పూజలు నిష్ఫలమై, ఆమె ఈ లోకాన్ని విడిచివెళ్ళారు. ఆమె మరణంతో తమిళనాట ఒక సంచలన ఘట్టం ముగిసింది. ఆమెకు ఆంజనేయ భక్తుడిలాంటి పన్నీరు సెల్వంనే ఆమె స్థానంలో కూర్చోబెట్టడం జరిగింది.

అయితే జయలలిత మరణించిన రెండు నెలలకే తమిళ రాజకీయాలలో మరో సంచలన సన్నివేశానికి తెరలేచింది. జయలలిత నెచ్చెలి, వివాదాస్పదురాలైన శశికళ సీఎం పీఠంపై కన్నేసింది. ఇప్పటికిప్పుడు పన్నీరుసెల్వంను ముఖ్యమంత్రి పీఠం నుండి దించాల్సిన అవసరం ఏమీ లేకపోయినా, వేగంగా పావులు కదిపింది. పన్నీరును దించి తాను సీఎం కుర్చీ ఎక్కబోతున్నానన్న సంకేతాలు పంపింది. తదనుగుణంగానే తన ఎమ్మెల్యేలను సమావేశపరచి తనను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకునేలా చేసింది. పన్నీరు చేత రాజీనామా చేయించింది. ఆయన చేతనే తాను సీఎంగా ప్రతిపాదించుకుంది. కథంతా సాఫీగా సాగిపోతుందిలే అనుకున్న తరుణంలో నాటకంలో అనూహ్య మలుపులు చోటుచేసుకున్నాయి. వీరవిధేయుడు అడ్డం చెప్పాడు. చెప్పినట్లు బుద్ధిగా నడుచుకుంటాడనుకున్న పన్నీరుసెల్వం అడ్డం తిరిగాడు. 'అమ్మ' సమాధి సాక్షిగా శశికళపై తిరుగుబాటు చేసాడు. తనను బెదిరించి రాజీనామా లేఖ తీసుకున్నారని ఆరోపించారు. వేరు కుంపటి పెట్టాడు. దీంతో సీఎంగా ప్రమాణస్వీకారం చేయడమే తరువాయి అనుకుంటున్న శశికళ గుండెల్లో రాయి పడింది. పన్నీర్‌సెల్వం తిరుగుబాటుతో గవర్నర్ విద్యాసాగర్‌రావు కూడా ఆచితూచి వ్యవహరించారు. ప్రభుత్వ ఏర్పాటుకు వెంటనే ఎవర్నీ ఆహ్వానించలేదు. ముఖ్యంగా ఫిబ్రవరి 15వ తేదీన శశికళ అక్రమాస్తుల కేసులో తీర్పు వచ్చే అవకాశముండడంతో ఆ దృష్ట్యా కూడా తొందరపడలేదు. ఈలోపు శశికళ తన ఎమ్మెల్యేలను కాపాడుకోవడానికి వారందరిని గోల్డెన్ బే రిసార్ట్స్‌కు తరలించి క్యాంప్ పెట్టింది. ఒక్కో ఎమ్మెల్యేకు భారీ మొత్తంలోనే డబ్బు ఆశ చూపిందని, కాబట్టి ఎమ్మెల్యేలు ఎక్కువమంది ఆమె వద్దే వున్నారని తెలిసింది.

## తలరాతలు మార్చిన తీర్పు!

ఏ సుప్రీం కోర్టు తీర్పు కోసం అయితే గవర్నర్ ఎదురు చూసాడో 15వ తేదీ ఆ తీర్పు రానే వచ్చింది. అక్రమాస్తుల కేసులో శశికళకు నాలుగేళ్ళ శిక్ష పడింది. ఇంకేముంది మొత్తం అంచనాలన్నీ తలక్రిందులయ్యాయి. ముఖ్యమంత్రి పీఠమెక్కి సచివాలయానికి పోవాలనుకున్న శశికళ జైలుకుపోవాల్సి వచ్చింది. ఆమె కలలు చెదిరిపోయాయి. ఓ పక్క జైలు జీవితం కళ్ల ముందు కనిపిస్తున్నా కూడా ఆ మనిషి ఆ రోజంతా కూడా రాజకీయ వ్యూహాల్లోనే గడిపింది. శాసనసభాపక్ష నేతగా తన స్థానంలో పళనిస్వామిని నియమించింది. తన మేనల్లుడు దినకరన్‌ను పార్టీ ఉపకార్యదర్శిగా నియమించింది. జయలలిత సమాధి వద్దకెళ్లి అంజలి ఘటించి ప్రత్యర్థుల పట్ల ప్రతీకారం తీర్చుకుంటానని శపథం చేసి జైలుకు బయల్దేరింది. ఇక్కడితో శశికళ సీఎం కలల ఎపిసోడ్ ముగిసినట్లయ్యింది.

## ఫస్ట్‌క్లాస్ సౌకర్యాల కోసమేనా!

తమిళ ప్రజలెవరూ శశికళను సీఎంగా కోరుకోలేదు. ఆమె సీఎం అనే భావం వచ్చేసరికి ప్రజల్లో వ్యతిరేకత తీవ్రంగా వచ్చింది. ఆమెకు రాజకీయ నేపథ్యం లేదు. ప్రజల కోసం పోరాడింది లేదు. జయలలితకు స్నేహితురాలిగా మాత్రమే ఆమె ప్రజలకు తెలుసు. అంతమాత్రాన ప్రజలు జయలలిత స్థానంలో ఆమెను చూడలేరుగా! అయితే ఎమ్మెల్యేల బీర్రుతో ఆమె సీఎం కావడానికి తొందరపడింది. పన్నీరుసెల్వం సీఎం అయ్యిందే రెండునెలల క్రితం. ఇంతలోనే ఆయనను దించేసి శశికళ సీఎం పీఠం ఎక్కా లనుకోవడంపై తీవ్ర విమర్శలొచ్చాయి. పన్నీర్‌సెల్వం పరిపాలనలో వైఫల్యాలు కూడా ఏమీ లేనప్పుడు ఆయనను తప్పించాల్సిన అవసరం ఏముందనే ఆరోపణలొచ్చాయి. కాని శశికళ సీఎం కావాలను కోవడం వెనుక ఒక బలమైన కారణం కనిపిస్తోంది. ఫిబ్రవరి 15వ తేదీన అక్రమాస్తుల కేసులో తీర్పు రాబోతుందని ఆమెకు తెలుసు. తీర్పు అనుకూలంగా వస్తే ఇబ్బంది లేదు. అంతా హ్యాపీనే! అదే వ్యతిరేకంగా వస్తే... జైలులోనూ సాధారణ ఖైదీ జీవితమే! అదే సీఎం హోదాలో వుండి జైలు శిక్ష పడితే జైలులో ఆమెను ప్రత్యేకఖైదీగా పరిగణిస్తారు. ఫస్ట్‌క్లాస్ వసతులన్నీ ఉంటాయి. ఈ దృష్టితో ఆలోచించే కోర్టు తీర్పుకు ముందే ఆమె సీఎంగా ప్రమాణస్వీకారం చేయాలనుకుంది. ప్రమాణస్వీకారం తర్వాత ఒక గంట సీఎంగా వున్నాచాలు... సీఎం సీఎమ్మే... అప్పుడు ఆమెకు జైలులో రాజభోగాలుండేవి. కాని పన్నీరు సెల్వం తిరుగు బాటు, గవర్నర్ విద్యాసాగర్‌రావు వేచిచూసే ధోరణితో శశికళ సాధారణ ఖైదీగా మారిపోయింది.

## పన్నీర్‌కే ఛాన్సుండేదా?

ఒకవేళ పన్నీరుసెల్వం తిరుగుబాటు చేయకుండా జయలలిత పట్ల చూపినట్లే శశికళ పట్ల కూడా విధేయత చూపుంటే తిరిగి మళ్ళీ ఆయనకే సీఎం పదవి దక్కి ఉండేది. ఎందుకంటే శశికళకు కూడా ఆయనపై నమ్మకం కుదిరేది. ఓ వారంరోజులు ఆయన సీఎం సీటుకు దూరమై ఉండేవాడంతే! వచ్చే ఎన్నికల దాకా తిరుగులేకుండా సీఎం సీట్లో ఉండేవాడు.

## విఫలమైన వ్యూహం

శశికళపై తిరుగుబాటు చేసిన తర్వాత తన వద్దకు కొంతమందైనా ఎమ్మెల్యేలు వస్తారని పన్నీరు భావించారు. అయితే 9మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఆయన శిబిరంలో చేరారు. కనీసం 20మంది ఎమ్మెల్యేలు ఆయన వైపు వచ్చున్నా డిఎంకె మద్దతుతో ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశముండేది. తగిన సంఖ్యలో పన్నీరు వెంట ఎమ్మెల్యేలు రాకపోవడం కూడా రాజకీయ అనిశ్చితిలో ఓ భాగమైంది.

## సీన్ మార్చిన గవర్నర్

శశికళ సీఎం కాకూడదన్నది ప్రధాని మోడీ నుండి చాలా మంది టార్గెట్! అది నెరవేరింది. ఇప్పుడు తమిళనాడులో తమకు అనుకూలమైన ప్రభుత్వం ఏర్పడడం కేంద్రంలోని ఎన్డీఏకు అవసరం. ఇందుకు ఎవరివైపు మొగ్గుచూపుతారన్నది ప్రశ్న? అన్నాడిఎంకె శాసనసభాపక్షనేతగా ఎన్నికైన పళనిస్వామిని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించడం తప్ప మరోమార్గం లేకుండా పోయింది. తమకు అనుకూలుడైన పన్నీరుసెల్వంను అధికార పీఠంపై కూర్చోబెట్టాలనుకున్నా కూడా, బీజేపీ నాయకులకు అది అసాధ్యంగానే కనిపించింది. పన్నీరు పక్కన 10మందికంటే ఎక్కువ ఎమ్మెల్యేలు లేరు. ఇంకో పక్క డిఎంకె అధినేత స్టాలిన్ మాట మార్చాడు. అసెంబ్లీలో బల నిరూపణ సమయంలో తమ నిర్ణయం ప్రకటిస్తామన్నాడు. అసెంబ్లీలో బలనిరూపణకు అవకాశమిస్తే అటు పళనిస్వామి, ఇటు పన్నీరుల పక్కన మెజార్టీ ఎమ్మెల్యేలు లేకపోతే ప్రభుత్వం పడిపోతుంది. అప్పుడు ఎన్నికలకు పోవాల్సి వస్తుంది. డిఎంకెకి కావాల్సింది ఇటువంటి వాతావరణమే. ఈసారి ఎన్నికలంటూ జరిగితే జయలలిత లేదు కాబట్టి ఖచ్చితంగా డిఎంకె లాభపడుతుంది. కేంద్రంలో ఉన్న ఎన్డీఏకు డిఎంకె మద్దతు ఇవ్వదు. కాంగ్రెస్‌కి మద్దతుదారుగా వున్న డిఎంకె అధికారంలోకి రావడం వల్ల తమకు ఎటువంటి లాభంలేదని భావించిన బీజేపీ నాయకులు తమిళనాడులో అన్నాడిఎంకె ప్రభుత్వాన్ని నిలబెట్టడానికే నిర్ణయించుకున్నారు. ఈ దిశలోనే మెజార్టీ ఎమ్మెల్యేల మద్దతు వున్న పళనిస్వామికి అవకాశం కల్పించారు.

మొత్తం ఎపిసోడ్‌లో బలైపోయింది ఇద్దరు వ్యక్తులే! మొదట గతంలోవున్న కేసుల కారణంగా శశికళ జైలుకుపోగా, ఎవరో చెప్పిన మాటల భరోసాతో శశికళపై తిరుగుబాటు చేసి ఇప్పుడు ఒంటరిగా మిగిలిపోయిన పన్నీర్‌సెల్వం ఈ రాజకీయ డ్రామాలో బలైపోయారని చెప్పవచ్చు. ఒకవేళ శశికళపై ఆయన తిరుగుబాటు చేయకుండుంటే, కొద్దిరోజుల క్రితం వదిలిన సీఎం కుర్చీ తిరిగి ఆయన క్రిందకే వచ్చుండేది!

# ఇంటి పన్నులు వెంటనే తగ్గించాలి



నెల్లూరు నగరంలోని మన్సూర్‌నగర్, కోటమిట్ట ప్రాంతాల్లో ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ అధ్యక్షుడు అబ్దుస్సమీ ఆదివారం పర్యటించి ఇంటి పన్నుల పెంపు విషయమై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఇబ్బందులుపడుతున్న ప్రజలపై పన్నుల భారం మోపడం తగదని సూచించారు. సామాన్య ప్రజలు బాడుగ ఇళ్ళల్లో చేరి సమయానికి బాడుగ కట్టలేక బాధపడుతున్నారన్నారు. ఇంటి పన్నులపై ప్రజలకు భారం లేకుండా కనీసం వడ్డీ మినహాయించి వసూలు చేయాలని సూచించారు. రాబోయే మార్చిలో పెంచివున్న పన్నుల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. నగర అధ్యక్షులు షాహిద్, మసూద్, నసీరుద్దీన్‌షా, అనీస్, అబ్దుల్ రహీం, ఖాజా, జహీర్, ఖలీల్ పాల్గొన్నారు.

# 'నేస్తం' సేవలు అభినందనీయం



నెల్లూరులోని నేస్తం ఫౌండేషన్ ద్వారా పలువురు యువకులు చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ ప్రశంసించారు. నేస్తం ఫౌండేషన్-ఇనమడుగు యూత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 12న ఇనమడుగులో రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రత్యేకించి రక్తదానం ఆవశ్యకతను, రక్తం కొరత వుంటే ఎదురయ్యే సమస్యలను ఆయన వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో తరచుగా ఇలాంటి రక్తదాన శిబిరాలు నిర్వహిస్తే ప్రజల్లో రక్తదానం పట్ల అవగాహన పెరుగుతుందని, తద్వారా అత్యవసర పరిస్థితుల్లో రోగులకు ఎలాంటి ఆపద కలుగకుండా నివారించేందుకు కృషిచేసినట్లవుతుందని అన్నారు. రెడ్‌క్రాస్ రక్తనిధి బృందం వారు ఈ రక్తదాన శిబిరంలో 153 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో నేస్తం ఫౌండేషన్ అధ్యక్షుడు కోరెం ప్రవీణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు రాచర్ల వెంకట్, దాడి శీను, బాణాల మధు, సురేష్‌రెడ్డి, కోరెం వెంకటేశ్వర్‌రావు, గాలి శివ పాల్గొన్నారు.

# మేయర్‌పై చర్యలు తీసుకోవాలి

## - వైయస్సార్‌సీపీ మైనార్టీ విభాగం

జాతీయ జెండాను అగౌరపరిచిన నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైయస్సార్సీపీ మైనార్టీ విభాగ నాయకులు పోలీసు అధికారులను డిమాండ్ చేశారు. సోమవారం నెల్లూరు ఒకటవ పోలీస్‌స్టేషన్‌లో సిఐ షేక్ అబ్దుల్ కరీంకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వైయస్సార్సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు హంజాహుస్సేని మాట్లాడుతూ నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్లో పిఎస్ఎల్‌వి-సి37 రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని ఆదివారం బైక్‌ర్యాలీ జరిగిందని, ఈ ర్యాలీని నగర మేయర్ అబ్దుల్ అజీజ్ జాతీయ జెండా వూపి ప్రారంభించారని పేర్కొన్నారు. జాతీయ జెండాను ఎగురవేయాలేగాని, ర్యాలీ ప్రారంభానికి ఉపయోగించడం జెండాను అవమానించడమేనన్నారు. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మైనార్టీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మునీర్‌సిద్దిక్, కార్పొరేటర్ ఎండి ఖలీల్ అహ్మద్, ఇంతియాజ్, ఫయాజ్‌ఖాన్, మున్వర్, ముస్తాక్ అహ్మద్, తాలిక్ అహ్మద్, రవూఫ్, షకీర్, హాజీ, షబ్బీర్, మక్దూమ్ తదితరులు పాల్గొన్నారు.

# తప్పులో కాలేసిన బాబు

(మొదటి పేజీ తరువాయి)

మహిళలకు జరిగిన అన్యాయాలను ప్రస్తావించి ఉండేది. ప్రశ్నించి ఉండేది! మహిళా సదస్సులు పెట్టేది మహిళలపై జరుగుతున్న అరాచకాలను ప్రశ్నించడానికి, చర్చించడానికి కూడా! అంతేగాని చంద్రబాబు కమ్మగా భోజనం పెట్టాడని చప్పట్లు తట్టి పొగడడానికి కాదు. ప్రతి విషయం మీద చర్చ జరగాలి! మహిళలపై జరిగిన అరాచకాలను ప్రశ్నించినప్పుడు ప్రభుత్వం కూడా దానికి వివరణ ఇవ్వాలి. కాని ఈ రాష్ట్రంలో జరిగిన కొన్ని మహిళలకు సంబంధించిన నేరాలపై వివరణ ఇచ్చే సామర్ధ్యం ప్రభుత్వం వద్ద లేదు. సదస్సులో రోజా ఈ అంశాలను ప్రస్తావిస్తే ఖచ్చితంగా ప్రభుత్వం పరువుపోతుంది. అందుకే గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లోనే పోలీసులు రోజాను అడ్డుకుని ఒక ఉగ్రవాదిని అరెస్ట్ చేసినట్లుగా తమ వాహనంలో ఎక్కించి తిరిగి హైదరాబాద్‌లో ఆమె ఇంటి వద్ద వదిలిపెట్టారు. రోజా ఒక ఎమ్మెల్యే... మాఫియా డాన్ దావూద్ ఇబ్రహీంను అరెస్ట్ చేయడానికి ఇచ్చినంత బిల్డప్‌ను రోజాను అరెస్ట్ చేయడానికి సృష్టించారు. రోజా సదస్సుకు వచ్చి మాట్లాడుంటే చంద్రబాబు ప్రభుత్వానికి డామేజీ జరిగి ఉండేదో లేదో గాని ఆమెను అరెస్ట్ చేసి నిర్బంధంగా తరలించిన చర్యల వల్ల మాత్రం తెలుగుదేశంకు తీరని డ్యామేజీ జరిగింది.

## వెంకన్న భక్తుడి కథను

# వెండితెరకెక్కించిన బాబా భక్తుడు




'ఓం నమో వేంకటేశాయ' చిత్రం సూపర్ హిట్టయింది. ఎవరి నోట విన్నా ఈ చిత్రం అత్యద్భుతంగా వుందన్న మాటే వినవస్తోంది. దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు దర్శకత్వం, హాథీరాంబాబాజీగా అక్కినేని నాగార్జున నటనా ప్రతిభ ఆద్యంతం అమోఘమన్నది అందరి మాట. దీంతోపాటు, ఈ సూపర్ సక్సెస్ వెనుక మరో ప్రధాన కారణం ఈ చిత్రాన్ని తెరకెక్కించిన నెల్లూరీయుడు ఆల్తూరు మహేష్‌రెడ్డి భక్తిభావం.. సంకల్పబలం. బాబా భక్తుడైన మహేష్‌రెడ్డి తొలుత షిర్డీసాయి చిత్రం నిర్మించినా, ఓం నమో వేంకటేశాయ చిత్రానికి వచ్చినంత ప్రఖ్యాతి ఆ చిత్రానికి రాలేదనే అభిప్రాయాలు లేకపోలేదు. తాను స్వతహాగా బాబా భక్తుడైనా, అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన ఆ శ్రీ వేంకటేశ్వరునిపై కూడా ఎనలేని భక్తిశ్రద్ధలతో వెంకన్నకు పరమభక్తుడైన హాథీరాంజీ కథను అత్యద్భుతంగా తెరకెక్కించిన ఘనత ఆల్తూరు మహేష్‌రెడ్డికే దక్కింది. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ చిత్రంతో.. నిర్మాతగా ఆయన జీవితం ధన్యమైందనే చెప్పాలి. ఎంతో చిత్తశుద్ధి, భగవంతునిపై భక్తి లేకుండా భక్తిచిత్రాలు సాధారణంగా ఒక పట్టాన హిట్ కాలేవు. అయితే,


చిత్ర నిర్మాత ఆల్తూరు మహేష్‌రెడ్డి

### • నెల్లూరీయుడి అఖండ విజయం

నెల్లూరీయులైన ఆల్తూరువారి కుటుంబం తొలినుంచీ ఆధ్యాత్మికత్వంలోనే పుట్టి పెరిగింది. అది వారి పూర్వజన్మ సుకృతం. దైవచింతనే వారికి నిత్యకార్యక్రమం. అందులోనూ అటు బాబా ఆశీస్సులు, ఇటు కలియుగ వైకుంఠదైవమైన తిరుమలేశుని దీవెనలు నిండుగా మెండుగా వున్న కుటుంబం అది. అందుకే, వారు నిర్మించే భక్తిచిత్రాలు భక్తజనులను భక్తి పారవశ్యంతో ఓలలాడిస్తున్నాయి. ప్రత్యేకించి ఓం నమో వేంకటేశాయ చిత్రంలో వెంకన్న భక్తుడైన హాథీరాంజీ బాబాజీ కథ అన్నమయ్యకు వున్నంతగా ప్రాచుర్యంలో లేకపోయినా, ఈ చిత్రం ద్వారా బాబాజీ బాలాజీకి చేసిన సేవలు, పూజలు.. ఆ భక్తునికీ–భగవంతునికీ వున్న అనుబంధం ఈ చిత్రం ద్వారా మరింతగా వెలుగులోనికి వచ్చాయి. తిరుమలలో శ్రీవారికి సుప్రభాత సేవ నుంచి పవళింపు సేవ దాకా ఎంతో భక్తిశ్రద్ధలతో నియమబద్ధంగా జరిగేందుకు, స్వామివారి నిత్య కళ్యాణం జరిపించేందుకు నాంది పలికింది హాథీరాంజీ బాబాజీయేనని చాలామందికి తెలియదు. జనానికి అంతగా పరిచయం లేని హాథీరాం బాబాజీ కథ భక్తులందరికీ ఎంతో ఆసక్తిగొలుపుతుంది కూడా. అటు హాథీరాంజీ కథతో పాటు, తిరుమలేశుని ఆవిర్భావ విశేషాలు, తిరుమలకొండ మహిమలు అన్నీ వివరంగా తెలిసేవిధంగా ఈ చిత్రం రూపొందించడంతో భక్తులందరినీ ఈ చిత్రం ఎంతగానో ఆకట్టుకుంటోంది. అక్కినేని నాగార్జున ఈ చిత్రంతో 'హాథీరాంబాబాజీగా' భక్తుల మదిలో నిలిచిపోతారు. అనుష్క, సౌరభ్‌జైన్, జగపతిబాబు, ప్రగ్యాజైస్వాల్, బ్రహ్మానందం తదితరుల నటనా వైదుష్యం అందరి ప్రశంసలూ అందుకుంటోంది. ఈ చిత్రంలోని పాటలు, మాటలు, సన్నివేశాలతో పాటు, భారవి రచన, కీరవాణి సంగీతం అన్నీ దేనికవే ప్రత్యేకతతో ఎంతో బావున్నాయి. భక్తాదులందరినీ అలరించే చిత్రమిది. ఆద్యంతం భక్తిభావ సమన్వితంగా.. సకలజనరంజకంగా నిర్మితమైన ఈ చిత్రం ప్రత్యేకించి నిర్మాత ఆల్తూరు మహేష్‌రెడ్డి భక్తిభావాన్ని ఇనుమడించేదిగా వుంది. పేరొందిన భక్తి చిత్రాల వరుసలో 'ఓం నమో వేంకటేశాయ' కూడా ప్రధానంగా నిలచి.. తెలుగు సినీరంగంలోనే ఈ చిత్రం ఒక ప్రత్యేకస్థానాన్ని పొందుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఏదేమైనా నిర్మలమైన భక్తిభావంతో ఇంతటి విశిష్టమైన చిత్రాన్ని నిర్మించిన నిర్మాత ఆల్తూరు మహేష్‌రెడ్డి మన నెల్లూరీయుడు కావడం సింహపురిసీమకే గర్వకారణం. ఆధ్యాత్మిక తత్వానికే ప్రతినిధిగా పేరుపొందిన ఆల్తూరు దంపతులు ఆదినారాయణరెడ్డి–సులోచనమ్మ. వారి కుమారులు గిరీష్‌రెడ్డి, మహేష్‌రెడ్డి కూడా అమ్మానాన్నల బాటలోనే భక్తిభావంతో తమ జీవనసరళిని సాగించడం అభినందనీయం. అటు వ్యాపార రంగంలో తలమునకలైనా మరోవైపు ఆధ్యాత్మికతత్పరతతో భక్తులకు సేవచేస్తున్న ఆల్తూరు కుటుంబానికి ఆ ముక్కోటిదేవతల ఆశీస్సులు పుష్కలంగా లభించాలని ఆకాంక్షిద్దాం.

# మహా కుంభాభిషేకానికి పోటెత్తిన భక్తజనం

- వేమిరెడ్డి దంపతుల ఉభయకర్తృత్వంలో చెంగాళమ్మతల్లికి అపూర్వమైన పూజలు
- కోటికుంకుమార్చన, కలశాభిషేకాలతో పులకించిన చెంగాళమ్మతల్లి కోవెల



భక్తుల కొంగుబంగారంగా, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధిచెందిన సూళ్లూరుపేటలోని శ్రీ చెంగాళ పరమేశ్వరి అమ్మవారికి తొమ్మిది రోజులపాటు నిర్విరామంగా కనీవినీ ఎరుగని విధంగా అపూర్వమైన పూజలు, సేవలు, కోటికుంకుమార్చనలు, కలశాభిషేకలు వైభవోపేతంగా జరిగాయి. నెల్లూరుకు చెందిన ప్రముఖ దాత, ఆధ్యాత్మికవేత్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి దంపతుల ఉభయకర్తృత్వంలో అమ్మవారి ఆలయంలో బుధవారం మహా కుంభాభిషేకం నేత్రపర్వంగా సాగింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, ఉభయదాతలైన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి–ప్రశాంతి దంపతులు కలశాభిషేకం కోసం సిద్ధం చేసిన జలాలను తలపై వుంచుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, గర్భాలయ గాలిగోపురంపై వున్న కలశాలను శుద్ధి చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ఆలయ గాలిగోపుర కలశాలకు అభిషేకం చేశారు. అనంతరం చెంగాళమ్మతల్లిని కలశ జలాలతో అభిషేకించి మహా కుంభాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్నారు. 'న భూతో న భవిష్యతి' అన్నట్లుగా జరిగిన ఈ మహాకుంభాభిషేకాన్ని తిలకించడానికి భక్తజనులు పోటెత్తడంతో అమ్మవారి ఆలయం మరింత కోలాహలంగా మారింది. తరలివచ్చిన భక్తులంతా పెద్దపెట్టున చేసిన అమ్మవారి నామస్మరణలతో ఆలయప్రాంగణం మారుమ్రోగిపోయింది. ఈ పూజోత్సవాల సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించగా, ఆలయ అర్చకులు అమ్మవారిని సుగంధభరిత పుష్పమాలికలతో, విశేషాభరణాలతో అలంకరించారు. వేదమంత్రాల మధ్య, మంగళవాయిద్యాల మధ్య ఎంతో భక్తిశ్రద్ధలతో మహాకుంభాభిషేక మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ నెల 7 నుంచి 15వ తేది వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అమ్మవారికి ఎంతో ప్రీతికరమైన కోటికుంకుమార్చనలు, కలశాభిషేకాలు, మహాకుంభాభిషేక వేడుకలతో అమ్మవారి ఆలయం కళకళలాడింది. ప్రత్యేకించి ప్రముఖ దాత, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకే స్ఫూర్తిప్రదాత అయిన వేమిరెడ్డి దంపతులు ఈ మహాకుంభాభిషేక మహోత్సవానికి ఉభయకర్తలుగా వుండి పర్యవేక్షించడంతో అన్ని ఏర్పాట్లు ఎంతో ఘనంగా.. సజావుగా సాగాయి. ఈ పూజోత్సవాల ముగింపు సందర్భంగా కలశాభిషేకానికి నిర్వహించిన జలాల కోసం, కోటి కుంకుమార్చన, మహాకుంభాభిషేకం వేడుక సందర్భంగా ఆలయ అర్చకులు పంచిపెడుతున్న కుంకుమ కోసం మహిళలు పెద్దసంఖ్యలో పోటీపడ్డారు. జిల్లావ్యాప్తంగా అమ్మవారి భక్తులంతా ఈ వేడుకలకు తరలివచ్చారు. మహాకుంభాభిషేకం అనంతరం, అమ్మవారికి శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకారాన్ని నిర్వహించి ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ వేడుకల్లో వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి దంపతులతో పాటు జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు దంపతులు, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, ఆలయ కమిటీ ఛైర్మెన్ ముప్పాళ్ళ వెంకటేశ్వర్లురెడ్డి, సభ్యులు ఆకుతోట రమేష్, చిట్టేటి పెరుమాళ్, చిలకా యుగంధర్, వేనాటి గోపాలరెడ్డి, పులుగు శ్రీనివాసులురెడ్డి, ఎం.విజయలక్ష్మి, అలవల సూరిబాబు, పిట్ల సుహాసినితో పాటు టిడిపి నాయకులు వెంకటాచలంరెడ్డి, జెట్టి వేణుయాదవ్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com